నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

నమ్మలేని నిజాలు

గెలుపు మాత్ర
ప్రజాసంగ్రామ యాత్ర
కాలంచెల్లింది.

అర్థం కానిది
సిసలైన కవిత్వం
శూన్యతాత్పర్యం.

ఈతకొలను
జీవమృత్యుదారి
సమాజజ్ఞానం

మాటలపెట్టె
తేనె లేని తెట్టియ
కొరగానివి.

ఋణాను బంధం
అణాల జీవబంధం
కాలానుగుణం

- రేడియమ్
సెల్: 9291527757

నీనిజాలు

రిలయన్స్ ముఖేష్ అంబాని
కొట్టుకుంటు తప్పెట్లో !
పాత్రికేయుల భయపెట్టి
వేసుకునే గుప్పిట్లో !

ఆంబోతు ధనాధి నేత
వేస్తూను రంకెల్లు !
మీడియా చిరుదూడలకు
బిగించెను సంకెళ్ళు !

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ | గురువారం 5-5-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 224 | పేజీలు:6 | వెల: రూ.1/-

నారాయణపూర్‌లో ఎన్‌కౌంటర్.. మావోల కాల్పుల్లో జవాన్ మృతి

రాయ్‌పూర్, మే 4:: ఛత్తీస్‌గఢ్ నారాయణపూర్‌లో మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో డీఆర్‌జీ జవాన్ సలిఖ్‌రామ్ మృతి చెందారు. ఇర్పనార్ అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగినట్లు తెలుస్తుండగా.. ఎదురు కాల్పుల ఘటనను బస్తర్ ఐజీ పీ సుందర్‌రాజ్ ధ్రువీకరించారు. నారాయణపూర్ జిల్లా కేంద్రానికి 70 కిలోమీటర్ల దూరంఓల ఉన్న బర్పూర్ మార్గ్‌లోని కడమెటా ? కడేనార్ మధ్య మావోయిస్టులు సంచరిస్తున్నారన్న సమాచారం అందుకున్న డీఆర్‌జీ, ఐటీబీపీ సిబ్బంది కూంబింగ్ చేపట్టారు.

ఈ క్రమంలో ఇర్పనార్ అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలపై మావోలు భద్రతా సిబ్బందిపై మెరుపుదాడి చేశారు. వెంటనే భద్రతా బలగాలు సైతం తేరుకొని ధీటైన సమాధానం ఇచ్చాయి. మావోల కాల్పుల్లో తీవ్రంగా గాయపడడంతో డీఆర్‌జీ జవాన్ అక్కడికక్కడే మృతి చెందారు. భానుప్రతాప్‌పూర్‌లో నివాసం ఉంటున్న జవాన్ సలిఖ్‌రామ్ డీఆర్‌జీలో ఏఎస్ఐగా నియామకమయ్యారు. ఆయన మృతదేహాన్ని దంతెవాడ మీదుగా అటవీ మార్గంలో మార్గంలో నారాయణపూర్‌కు తరలించనున్నారు.

హైదరాబాద్‌లో భారీ వర్షం.. కూలిన హోర్డింగ్స్



హైదరాబాద్, మే 4: భాగ్యనగరంలో వర్షం బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులతో కూడిన వర్షం పడటంతో పలు ప్రాంతాల్లో హోర్డింగ్స్ కూలాయి. చార్మినార్, మలక్‌పేట్, బహదూర్‌పురా, చాదర్‌ఘాట్‌లో హోర్డింగ్స్ నేలకొరిగాయి. భారీ వర్షం కారణంగా ఎక్కడికక్కడ రోడ్లపై వరద నీరు నిలిచిపోయింది. వెంటనే అప్రమత్తమైన డీఆర్ఎఫ్ బృందాలు... మోటార్ల సహాయంతో వర్షపు నీటిని తొలగిస్తున్నారు. నగరంలో భారీ వర్షాల నేపథ్యంలో 19 జీహెచ్ఎంసీ డిజాస్టర్ బృందాలను బల్దియా అప్రమత్తం చేసింది.

కుంగిన రోడ్డు

: భారీ వర్షం కారణంగా నగరంలోని నల్లకుంటలో రోడ్డు కుంగింది. దీంతో నల్లకుంట నుండి వీఎస్టీ వైపు వెళ్లే రోడ్డును అధికారులు మూసివేశారు. గత కొద్ది రోజుల క్రితం స్టీల్ బ్రిడ్జి కోసం రోడ్డు తవ్వకం జరిగింది. రోడ్డు కిందే పెద్ద నాలా ఉండడం... ట్రాఫిక్ డైవర్ట్ చేయడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైనేజీ నీరు పొంగి రావడంతో 20 లక్షల మెటిరియల్ నీటిలో మునిగిపోయిందని జీహెచ్ఎంసీ అధికారులు చెబుతున్నారు.

రైతు దర్నాలు,రైతుకు ఇబ్బందులు ఉండొద్దన్నదే ప్రభుత్వ లక్ష్యం:గంగుల

కరీంనగర్ , మే 4: వేరే ఏ రాష్ట్రంలో తెలంగాణ మాదిరి పంటలు పండటం లేదని, కరెంటు,నీళ్లు, మౌళిక వసతులు లేవని, ఇవన్నీ సమకూర్చే గొప్ప ముఖ్యమంత్రి కేసీఆర్ లాంటివారు అక్కడ లేరనే అక్కసుతో కండ్లమంటతో మన రాష్ట్రానికి చెందని పార్టీలు పస లేని ఆరోపణలు చేస్తున్నాయన్నాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు, ఈ పార్టీల మాదిరే కొన్ని ప్రసార మాధ్యమాలు సైతం కొనుగోలు లేటయిందని, గన్నీలు ఉన్నాయా అని రైతుల్లో గందరగోళం సృష్టిస్తున్నాయని ఇది సరికాదన్నారు. కొనుగోలు కేంద్రాలు సజావుగా నడుస్తున్నాయని రాష్ట్ర వ్యాప్తంగా ఏ ఒక్కఈజీఈవతీ ఇబ్బందులు పడుతున్నామనే పిర్యాదులు రాకపోవడమే దీనికి నిదర్శనమన్నారు. రైతు కోతలు చేసి కొనుగోలు కేంద్రానికి ఫెయిర్ ఆవరేజ్ క్వాలిటీతో తీసుకురావాలని ఒక్క కిలో కూడా తరుగు పెట్టమన్నారు, గన్నీల లభ్యతపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని మంత్రి గంగుల తిప్పికొట్టారు,

ఈ యాసంగిలో అవసరమైన గన్నీబ్యాగులు 15కోట్లుగా అంచనా వేసామని ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించే నాటికే మన వద్ద మొత్తం 1కోటి 62 లక్షల 70వేల 611 గన్నీ బ్యాగులున్నాయని, మే 1 నాటికి 4కోట్లు సేకరిస్తామని చెప్పాము కాని నిన్నటి వరకూ 7కోట్ల 67లక్షల గన్నీ బ్యాగులను సిద్ధం చేసుకున్నాం. గన్నీ బ్యాగుల కొరత లేనే లేదన్నారు. ఎక్కడ తక్కువ ఉన్నా మా ద్రుష్టికి తెస్తే తక్షణం పంపిస్తామన్నారు.కరీంనగర్ నియోజకవర్గంలోని కొత్తపల్లి మండలం బద్దిపల్లి ,అసిఫ్ నగర్ ,నాగుల మాల్యాల లో ఆఅఓ ,తిఐఖ ,ఖంఆూ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంబించి మాట్లాడారు.కేంద్రం మోకాలడ్డిన పరిస్థితుల్లోనూ ఆర్థిక భారాన్ని భరించి ధాన్యం కొనుగోలు చేస్తున్న విషయం విధితమే. అయితే రాష్ట్రంలో కొంటున్న ధాన్యాన్ని వెంటవెంటనే రైస్ మిల్లులకు చేర్చి ఓపిఎంఎస్లో గుర్తించాలని అన్నారు. అప్పుడే రైతులకు త్వరితంగా నిధుల్ని బదిలీ చేసే అవకాశం ఉంటుందని చెప్తూ ఇదే సమయంలో ఎఫ్.సి.ఐ పిజికల్ వెరిఫికేషన్ ప్రక్రియ చేపడుతుందని తద్వారా రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలించే ప్రక్రియ నిలిపివేయాల్సి వస్తుందని అన్నారు. ఫిజికల్ వెరిఫికేషన్ కి ఇది సరైన సమయం కానందున కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవ తీసుకొని రైతులకు సత్వర సేవలు అందేలా చూడాల్సిన బాధ్యతలు తీసుకోవాలన్నారు. సరైన సమయంలో పీవీ చేయడమే కాకుండా ఎలాంటి అక్రమాలు ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం ఉపేక్షించదన్నారు.

దళిత బంధు పథకంతో.. దళితుల దిశ,దశ మారాలి : మంత్రి కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, మే 4:(నేటినిజం ప్రతినిధి):శతాబ్దాలుగా సామాజిక వివక్షకు, అణచివేతకు గురవుతోన్న దళితులు.. సాధికారత, స్వావలంబన సాధించేందు కోసం దళిత బంధు పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందనీ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. బుధవారం ఎల్లారెడ్డిపేట మండలం, పదిరకు చెందిన ముగ్గురు దళిత బంధు లబ్ధిదారులు అక్కపల్లి శివారులో నిర్మించుకోనున్న నాలుగు టన్నుల సామర్థ్యం గల రా రైస్ మిల్లు నిర్మాణానికి మంత్రి కేటీఆర్ భూమి పూజ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. దళిత కుటుంబాల ఆర్థిక అభ్యున్నతిని కాంక్షిస్తూ సీఎం కేసీఆర్ దళితబంధు పథకానికి శ్రీకారం చుట్టారని స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధి కోసమో, ఓట్ల కోసమో ఈ పథకాన్ని ప్రవేశపెట్టలేదన్నారు. సీఎం కేసీఆర్ పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా? దళిత బంధు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కూలీల నుంచి ఓనర్లుగా, సక్సెస్ ఫుల్ వ్యాపార వేత్తలుగా ఎదగాలనీ మంత్రి ఆకాంక్షించారు.

అరవై ఏండ్లుగా దళితుల కోసం అనేక పథకాలు అమలైనప్పటికీ సమాజంలో అత్యధిక మంది దళితులు అట్టడుగునే ఉన్నారని మంత్రి అన్నారు. ఎలాంటి బ్యాంకు గ్యారెంటీలు లేకుండానే నేరుగా లబ్ధిదారులకు రూ.10 లక్షలు ఆర్థిక సహాయాన్ని అందజేసే పథకం దేశంలోనే మరెక్కడా లేదని తెలిపారు. లబ్ధిదారులు ఎంపిక చేసుకున్న యూనిట్‌లకు సంబంధించి వ్యాపార నిర్వహణను సొంతంగా చూసుకోవాలని మంత్రి అన్నారు.

సెస్ నూతన పాలకవర్గం బాధ్యతల స్వీకరణ

సిరిసిల్ల పట్టణంలోని సెస్ కార్యాలయంలో సెస్ నూతన పాలకవర్గం పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. సెస్ చైర్మెన్ గూడూరి ప్రవీణ్ , సభ్యులు పదవీ బాధ్యతల స్వీకరించారు. మంత్రి కేటీఆర్, సాంస్కృతిక సారథి చైర్మెన్, మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జెడ్పీ చైర్ పర్సన్ ఎన్ అరుణ, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ నూతన పాలకవర్గానికి శు భాకాంక్షలు తెలిపారు.

రూ.11 కోట్లతో అడెల్లి పోచమ్మ ఆలయ పునర్నిర్మాణం: మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్, మే 4:: జిల్లాలోని అడెల్లి పోచమ్మ ఆలయాన్ని రూ.11 కోట్లతో పునర్నిర్మాణం చేపట్టనున్నట్లు దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. బుధవారం అడెల్లి పోచమ్మను మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అమ్మవారికి మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి,అక్కడే దేవాలయ అభివృద్ధిపై స్తపతి, అధికారులు, సంబంధిత ఇంజినీర్లతో చర్చలు జరిపారు.ఈ సందర్భంగా ఎనిటతీజీ ఎజీతీజీని తీవటటఎ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత దేవాలయాల అభివృద్ధి కి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో అనేక కార్యక్రమాలు అమలవుతున్నాయి అని చెప్పారు.

అడెల్లి పోచమ్మ దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు అన్ని వసతులు, సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. రూ. 11 కోట్లతో దశలవారీగా ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. మొదటి దశలో రూ. 3 కోట్లతో గర్భ గుడి, అర్థ మండమ, విమాన గోపుర నిర్మాణంతో జూన్ మూడో వారంలో ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అప్పటిలోగా టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఆలయ విస్తరణ నిర్మాణం చేపట్టనుండటంతో బాలాలయం నుంచి భక్తులకు అమ్మవారిని దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. యాదాద్రి తరహాలో కృష్ణశిలలతో ఆలయ నిర్మాణం జరగనున్నట్లు మంత్రి తెలిపారు. అద్భుతమైన శిల్పాలతో అమ్మవారి ఆలయం కొత్త రూపాన్ని సంతరించుకోనుందని పేర్కొన్నారు.

సిజేరియన్లకు ముహూర్తాలు పెట్టే మూఢనమ్మకం పోవాలి : మంత్రి హరీశ్‌రావు

జగిత్యాల, మే 4: : రాష్ట్రంలో సిజేరియన్లు తగ్గి, సాధారణ ప్రసవాలు పెరగాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. సిజేరియన్లకు అయ్యగార్లు ముహూర్తాలు పెట్టే మూఢనమ్మకం పోవాలన్నారు. ఆరోగ్య రంగాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

జగిత్యాల పట్టణంలో 100 పడకల మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వెంకటేష్, ఎమ్మెల్యేలు సంజయ్ కుమార్, రవి శంకర్, విద్యా సాగర్ రావు, టీఎస్ఎంఎస్ఐడిసి ఛైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, డీఎంఇ రమేష్ రెడ్డి, ఇతర అధికారులు, స్థానిక నేతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం కంటే ముందు జగిత్యాల పట్టణంలో ప్రభుత్వ మెడికల్ కాలేజ్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణాలను మంత్రులు పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. కరోనా సమయంలో నిర్వహించిన జ్వర సర్వే ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. ఆశా కార్యకర్తలు బాగా పని చేశారు. అందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ మూడు సార్లు జీతాలు పెంచారని గుర్తు చేశారు. 2014 లో రూ.1500 ఉంటే ఇప్పుడు రూ. 9750 ఇస్తున్నాం. ఆశా కార్యకర్తల జీతం గుజరాత్‌లో రూ. 4000, రాజస్థాన్‌లో రూ. 3000, మధ్య ప్రదేశ్‌లో రూ. 3000 మాత్రమే అని మంత్రి తెలిపారు.

సమాధానం కావాలి..

జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు 44 శాతమే వుంది. కేసీఆర్ కిట్లు, వైద్య సదుపాయాలు వచ్చాకా ఎందుకు 66 శాతం మంది ప్రైవేటు వెళ్తున్నారు. నాకు సమాధానం కావాలని హరీశ్‌రావు ఆరోగ్య శాఖ అధికారులను ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ వైద్య వ్యవస్థను బలోపేతం చేశాక, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు 30 శాతం ఉంటే ఇప్పుడు 56 శాతానికి పెరిగిందన్నారు. 108, 102 అమ్మ ఒడి వాహనాలు ఉన్నాయి. ఆడబిడ్డ పుడితే రూ.13,000 ఇస్తున్నాం, కేసీఆర్ కిట్స్ ఇస్తున్నాం. అయినా ప్రైవేటు ఎందుకు పోతున్నారని మంత్రి ప్రశ్నించారు.

జగిత్యాలలో 80 శాతం సిజేరియన్లు జరుగుతున్నాయి. సిజేరియన్ల వల్ల తల్లీబిడ్డలకు ఆరోగ్య సమస్యలు వస్తాయని హరీశ్‌రావు తెలిపారు. సీజేరియన్లు తగ్గించడంలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు కీలకపాత్ర పోషించాలన్నారు. దేవుడు ఇచ్చిన వరం సాధారణ ప్రసవం. అనవసరంగా సిజేరియన్లు వద్దని హరీశ్‌రావు సూచించారు. తల్లి పాలు అమృతంతో సమానం. సిజేరియన్ వల్ల మొదటి గంటలో మూత్రు పాలు అందటం లేదు. రాష్ట్రంలో పుట్టిన మొదటి గంటలో 36 శాతమే మూత్రు పాలు తాగుతున్నారని తెలిపారు.

సాధారణ ప్రసవాలు చేసే ప్రభుత్వ వైద్య బృందానికి రూ. 3 వేల ఇన్సెంటివ్ ఇవ్వాలని ఆలోచిస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం అమలు చేస్తామన్నారు. ఇదే సమయంలో సిజేరియన్లు చేసే వైద్య బృందానికి ఇన్సెంటివ్ తొలగిస్తామన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై శ్వేత పత్రం విడుదల చేసిన మంత్రి గంగుల

హైదరాబాద్, మే 4: ధాన్యం కొనుగోల్లపై ఆరోపణలు నిరాధారమని దానిపై బుధవారం శ్వేత పత్రం విడుదల చేసినట్లు రాష్ట్ర సివిల్ సప్లైస్ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వరి పండక పోవడం, ధాన్యం పండించే రాష్ట్రాలైన తెలంగాణ, పంజాబ్, ఓడిషా, చత్తీస్గడ్, ఆంధ్రప్రదేశ్ వంటి చోట్ల బీజేపీ అధికారంలో లేకపోవడం వల్లనే ధాన్యం కొనుగోళ్లలో కేంద్ర ప్రభుత్వం ఇబ్బందులు స్రుష్టిస్తున్నదని ఆరోపించారు. కేంద్రం సహకరించకున్నా ముఖ్యమంత్రి కేసీఆర్ నిధుల్ని సమకూర్చారని, రైతులకు ఇబ్బంది రాకుండా చూడాలని ఆదేశించారని తెలిపారు, అదే రీతిలో అత్యంత అవసరమైన గన్నీ బ్యాగులను సైతం కేంద్రం ఇంతవరకూ ఒక్క బ్యాగు ఇవ్వకున్నా స్వతహాగా రైస్ మిల్లర్ల వద్దనుండి, సప్లైయర్స్ వద్దనుండి యుద్ధప్రతిపాధికన సేకరించి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించామన్నారు. రైతులకు చిన్న ఇబ్బంది లేకుండా కొనుగోళ్ల ప్రక్రియను కొనసాగిస్తున్నామన్నారు.

కానీ కేంద్రం మాత్రం దీనికి పూర్తి విరుద్ధంగా రైతులపై కక్ష్య సాధింపు చర్యలు చేపట్టడం శోచనీయమన్నారు. యాసంగిలో రా రైస్ రాదని తెలిసినా అదే ఇవ్వాలని మంకు పట్టు పట్టడం, నేడు కొనుగోళ్లు ఊపందుకునే దశలో దాన్ని అడ్డుకునే విదంగా ఎఫ్.సి.ఐ అధికారులను ఉసిగొల్పి రైస్ మిల్లులపై వెరిఫికేషన్ పేరుతో దాడులు చేస్తూ, ధాన్యం దించకుండా అడ్డుకోవడం వంటి చర్యలతో తెలంగాణ రైతులపై కేంద్రం కక్ష్య సాధింపు చర్యలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. దీనిపై తెలంగాణ ఓట్లతో గెలిచిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించి రైతుల పక్షాన డిమాండ్ చేయాలన్నారు. కరీంనగర్ నియోజకవర్గంలో ని కొత్తపల్లి మండలం ఎలగందల్ ,చింతకుంట కరీంనగర్ రురల్ మండలం దుర్వేడ్, ముగ్ధుమ్ పూర్ ,చెర్లభుత్కూర్ ,చామన్ పల్లి నగునూర్ గ్రామాల్లో లో డీసీఎంఎస్,ఐకేపీ,పీఏసీఎస్ ల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లపై శ్వేత పత్రాన్ని విడుదల చేసినట్టు తెలిపారు. మంగళవారం సాయంత్రం వరకూ జరిపిన కోనుగోళ్ల వివరాలు, గన్నీబ్యాగుల అందుబాటు వంటి వివరాల్ని వెల్లడించారు, కొనుగోళ్ల మొదలు పెట్టిన రోజే బహిరంగంగా ఎన్ని గన్నీ బ్యాగులున్నాయన్నామో చెప్పామన్న మంత్రి నేడు కేంద్రం నుండి ఒక్క బ్యాగు రాకున్నా 7కోట్ల 77 లక్షల గన్నీలను రికార్డు స్థాయిలో సేకరించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 3525 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, 4,21 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 55553 మంది రైతుల దగ్గరినుండి సేకరించామన్నారు, ఈ ధాన్యం విలువ 821 కోట్లు అన్నారు. ఈ డబ్బుల్ని రైతులకు సకాలంలో అందజేయాలంటే మిల్లర్లు గుర్తించాల్సి ఉంటుందని, ఎఫ్.సి.ఐ అధికారులు ఫిజికల్ వెరిఫికేషన్ ప్రక్రియ పేరుతో మిల్లర్లు ధాన్యం దించకుండా అడ్డుకుంటున్నారని తద్వారా రైతులకు సకాలంలో ధాన్యం సేకరణ, డబ్బుల విడుదల చేయకుండా కుట్ర పన్నారన్నారు.

సీఎం కేసీఆర్ పాలనలోనే పల్లెల అభివృద్ధి : మంత్రి సబితా ఇంద్రారెడ్డి

రంగారెడ్డి, మే 4: సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే రాష్ట్రంలోని పల్లెలు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం శంకర్‌పల్లి మండలంలోని ఎల్వెర్తి, మహాలింగపురం, గాజులగూడ గ్రామాలలో నూతన గ్రామపంచాయతీ భవనాలు, రైతువేదికలు, సీసీ రోడ్లు, గ్రామ సంతలను ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాక ముందు రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు అందరికి కనిపిస్తున్నా యన్నారు. రాష్ట్రం రావాలనే తపనతో నాడు ప్రాణాలు పణంగా పెట్టి కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించారని కొనియాడారు. సీఎం కేసీఆర్ రైతు కుటుంబం నుంచి వచ్చారని, అందుకే రైతు సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు.దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో చేవెళ్లఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనిత, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నిజామాబాద్ ఎంపీపై నిప్పులు చెరిగిన ఎమ్మెల్సీ కవిత

నిజామాబాద్, మే 4:నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్‌పై టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిప్పులు చెరిగారు. పసుపు బోర్డు తెస్తానని బాండ్ పేపర్లు రాసిచ్చి, పసుపు రైతులను అరవింద్ మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజామాబాద్‌లో ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడారు.

ఈ మూడేండ్లలో పార్లమెంట్‌లో ఐదు సార్లు మాట్లాడిండు కానీ పసుపు బోర్డు, రైతుల గురించి మాట్లాడలేదని కవిత తెలిపారు. అరవిందన్ను మూడేండ్లు విడిచి పెట్టినం.. ఇప్పుడు మాత్రం విడిచి పెట్టేది లేదు. ఢిల్లీలో మోకాళ్ల యాత్ర చేస్తరో.. మీ నాయకుల వద్ద మోకరిల్లి పసుపు బోర్డు సాధించుకొని వస్తారో.. ఏం చేస్తరో చేయండి. కానీ బాండ్ పేపర్లో చెప్పినట్లు పసుపు బోర్డు పట్టుకొని రావాలి. లేదంటే తెలంగాణలో అడుగడుగునా నిలదీస్తాం, ప్రశ్నిస్తామని ఎమ్మెల్సీ కవిత హెచ్చరించారు.

నాలుకకు మడత లేకుండా అబద్ధాలు మాట్లాడారు..

ఈ మూడేండ్లలో నాలుకకు మడత లేకుండా అనేక అబద్ధాలు చెప్పారు అరవింద్ అని కవిత గుర్తు చేశారు. హైస్పీడ్‌లో అబద్ధాలు చెప్పడం తప్ప చేసిందేమీ లేదు. రాజ్ నాథ్ సింగ్ నుంచి మొదలుకుంటే అరవింద్ వరకు చాలా అబద్ధాలు చెప్పారు. బీజేపీ అబద్ధాలు చెప్పి కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి విభజన రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయి. గ్యాస్ సిలిండర్ల ధరల విషయంలో మహిళలను అవమానించేలా బీజేపీ నేతలు మాట్లాడుతున్నారు. మన మేలు కోరుకోనటు వంటి నాయకులను గుర్తించాలి. అరవింద్ మూడేండ్ల కిందట మాటిచ్చారు పసుపు బోర్డు తెస్తానని. పసుపు బోర్డు ఎప్పుడు తెస్తరు.. రైతులకు ఏం సమాధానం చెప్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. పసుపుకు మద్దతు ధర ఇస్తామని చెప్పారు. ఆ విషయం ఏమైందని కవిత నిలదీశారు.

అబద్ధాలు చెప్పి ఎంపీగా గెలిచారు..

నిజామాబాద్ జిల్లా వ్యవసాయ ఆధారిత జిల్లా. రైతులు పెద్ద ఎత్తున ఉన్నారని కవిత పేర్కొన్నారు. ఒక రాజకీయ రంగు పులిమి అనేక అబద్ధాలు చెప్పి.. బీజేపీ ఎంపీ సీటును గెలుపొందింది. కానీ నిజామాబాద్ ప్రజలకు, రైతులకు చేసిందేమీ లేదు. ఈ మూడేండ్లలో అనేక అబద్ధాలు చెప్పి రైతులను, ప్రజలను మోసం చేస్తున్నాడని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు.

వాస్తవాలను తెలియజేసేందుకే మీడియా ముందుకొచ్చా..

వాస్తవాలను తెలియజేసేందుకే మీడియా సమావేశం ఏర్పాటు చేశానని కవిత స్పష్టం చేశారు. 2014 మేలో ఎన్నికైన తర్వాత జులై నుంచి 2018 జులై వరకు పసుపు బోర్డు కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించాను. నాటి వాణిజ్య శాఖల మంత్రి సీతారామన్, ప్రధాని మోదీకి అనేక లేఖలు రాసి అడిగామన్నారు. 2016, ఆగస్టు 25 నాడు నరేంద్ర మోదీని పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని అడిగాం. 2017, మార్చి 24న పార్లమెంట్లో ప్రయివేటు మెంబర్ బిల్లు పెట్టామని తెలిపారు. 2017లో పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరామన్నారు. 2017లో స్పైస్ డెవలప్ మెంట్ ఏజెన్సీ ని కూడా ప్రకటించారు. డివిజనల్ ఆఫీసును పెట్టడం జరిగింది. 2019లోపే ఇవన్నీ జరిగిపోయాయి. ఇవన్నీ జరుగుతున్న సందర్భంగా పసుపు రైతులకు బాయిలర్లు కావాలని కేంద్రాన్ని కోరితే ఇవ్వలేదు. దీంతో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలోనే బాయిలర్లు పంపిణీ చేశారని తెలిపారు.

ఉచిత సలహాలు, ఉత్తుత్తి మాటలతో టైం పాస్

నేనే స్పైస్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ, డివిజనల్ ఆఫీసులు తెచ్చానని అరవింద్ చెబుతున్నాడు. దాంతో పాటు పసుపు రైతులతో మాట్లాడి డ్రామా క్రియేట్ చేస్తున్నాడు. ఉచిత సలహాలు, ఉత్తుత్తి మాటలతో అరవింద్ టైం పాస్ చేస్తున్నారని కవిత కోపోద్రిక్తులయ్యారు. 2020-21లో స్పైస్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ద్వారా వచ్చిన బడ్జెట్ కోటి 18 లక్షలు.. 2021-22కు 74 లక్షలు వచ్చింది. ఈ సంవత్సరానికి ఒక్క రూపాయి కూడా రాలేదు. ఈ మూడేండ్లలో కోటి 92 లక్షలు మాత్రమే తీసుకొచ్చారు. ప్రతి పసుపు రైతును మభ్య పెట్టి, బాండ్ పేపర్ రాసిచ్చి మోసం చేశాడు. పేరుకే సంగ్రామ యాత్రలు.. కానీ చేసేదేమీ ఉండదు. నిజమైన సంరక్షణ టీఆర్ఎస్ పార్టీ ద్వారానే లభిస్తుందని కవిత స్పష్టం చేశారు.

నిజామాబాద్‌లో 9 స్థానాలు గెలుస్తాం..

నిజామాబాద్ జిల్లాలో తొమ్మిది స్థానాలు గెలుస్తామన్న విశ్వాసం ఉందన్నారు కవిత. ఒకప్పుడు కరువుతో కటకటలాడిన తెలంగాణలో నేడు విరివిగా పంటలు పండుతున్నాయి. కేంద్రం నుంచి ఎలాంటి సహకారం లేకపోయినా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగాల నోటిఫికేషన్లు రావడంతో నిరుద్యోగులు చదువులో బిజీ అయిపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు కవిత.

నేడు పోలీసు ఉద్యోగాల బోర్డు ఛైర్మన్ శ్రీనివాసరావుచే స్పెషల్ లైవ్

హైదరాబాద్, మే 4: తెలం

నేటినిజం
సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 5-5-2022

మబ్బులు వీడిన ఆకాశం

ఆకాశం ఎంత విశాలమైనా
చిన్న చిన్న మబ్బులు చాలు
కమ్మి చీకటి చేయడానికి.
కొలను ఎంత లోతున్నా
చిన్న రాయి చాలు
అల్లకల్లోలం చేయడానికి.
కాస్తంత కలతతో
కొండంత నిబ్బరానికి తూట్లు.
గాత్ర గాంభీర్యం జీరబోవచ్చు
మత్త గజం తట్టి పడొచ్చు
ఉడుము పట్టు తప్పొచ్చు
అరుదుగా సంభవించే
అపసవ్యాలు, అస్తవ్యస్తాలు
కావెప్పుడూ తటస్థం.
ఎంత సహజమైనా
తొట్రుపాట్లు కావు శాశ్వతం.
చిరు దీపం
చిమ్మ చీకటిని పారద్రోలినట్లు
కాస్తంత ఓపిక వహిస్తే
మనసంతా మబ్బులు వీడిన ఆకాశమే!

-ఆచార్య కడారు వీరారెడ్డి
9392447007

మాతృమూర్తి స్పర్శకు ప్రతీకలు మంత్రసానులు

(05 మే 'అంతర్జాత మంత్రసానుల దినం' సందర్భంగా)

ప్రతి ఏటా 05 మే రోజున 'ఇంటర్నేషనల్ కన్ఫెడరేషన్ ఆఫ్ మిడ్‌వైఫ్స్' నేతృత్వంలో 'అంతర్జాతీయ మంత్రసానుల దినం (ఇంటర్నేషనల్ మిడ్‌వైఫ్స్ డే)' ఘనంగా, గర్వంగా నిర్వహించుట ఆనవాయితీగా వస్తున్నది. ఇంటర్నేషనల్ మిడ్‌వైఫ్స్ డే-2022 నినాదంగా 'శతాబ్దపు ప్రగతి' అనే అంశాన్ని తీసుకొని పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రసవ సేవలు, పురుటి నొప్పులు, గర్భిణి సేవలు, సంతానోత్పత్తి, లైంగిక సమస్యలు, మాతృత్వ విధులు, నవజాత శిశు లాలన, ప్రసవానంతర సూచనలు, పిల్లలు, కౌమారదశ యువత ఆరోగ్య సమస్యలు లాంటి బహువిధ సేవలను నిస్వార్థంగా అందించే పవిత్ర మంత్రసాని వృత్తిని గౌరవించడం, వారికి కృతజ్ఞతలు తెలియచేయటం మన కనీస బాధ్యతగా గుర్తించాలి. ప్రపంచవ్యాప్తంగా మంత్రసానులు ఏకమై ఈ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం పరిపాటి అయ్యింది. శిశు జననం, నవజాత శిశువు ఆరోగ్యం మంత్రసానుల విధి నిర్వహణపై మాత్రమే ఆధారపడి ఉంటుంది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ నేతృత్వంలో విడుదల చేసిన 'ప్రపంచ మంత్రసాని వృత్తి నివేదిక ఆధారంగా మంత్రసాని వృత్తి పట్ల ప్రత్యేక శ్రద్ధ, ప్రసవ సమయ జాగ్రత్తలు/ నవజాత శిశువు రక్షణ లాంటి అంశాల్లో సరైన శాస్త్రసాంకేతిక శిక్షణ తప్పక అందించాలని ఐరాస సభ్యదేశాలకు సూచనలు చేసింది. ఐరాస నిర్దేశించిన 'సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-3.1' ప్రకారం 2030 నాటికి ప్రతి లక్ష ప్రసవాలలో శిశు మరణాలు 70 కన్న తక్కువ ఉండేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని నిర్ణయించి, కార్యాచరణ రూపొందించారు. 1991లో ప్రారంభమైన వరల్డ్ మిడ్‌వైఫరీ డే సందర్భంగా ర్యాలీలు, పోటీలు, మంత్రసానులకు పుష్పగుచ్ఛాలు అందించడం, పలు కార్యశాలలు నిర్వహించడం జరుగుతోంది. మాతాశిశు సంక్షేమానికి పునాది వేసిన వారిలో మంత్రసానుల పాత్ర అద్వితీయం, అనితర సాధ్యం. ప్రపంచవ్యాప్తంగా ఏడాదికి 850 గర్భిణి మహిళలు, 2 మిలియన్ల నవజాత శిశువులు, 2.6 మిలియన్ల గర్భంలోని శిశువులు మరణించడం జరుగుతోందని వివరాలు తెలుపుతున్నాయి. శిశువుకు అమ్మగా, ప్రసవ వేదన పడుతున్న మహిళకు తల్లిగా, గర్భిణి కుటుంబ సభ్యురాలిగా, గర్భిణి స్త్రీకి సోదరిగా అనేక పాత్రలు పోషించే మంత్రసానులకు తగిన గౌరవం సమాజంలో దక్కడం లేదు. మంత్రసానులు లేకుండా జరిగే కాన్పులలో తల్లికి, శిశువుకు ప్రమాదకరంగా మారుతుందని మనకు తెలుసు. మంత్రసాని చేతిలో అమృత స్పర్శ ఉంది. తమ వ్యక్తిగత సమస్యలను పక్కన పెట్టి నవజాత శిశువును మృదువుగా, ప్రసవ వేదనలో ఓపికకు రూపంగా, మాతాశిశు రక్షణలో వైద్యురాలిగా తన విధులను సర్వోన్నత నిష్టతో నిర్వహించే మంత్రసానికి మాతా శిశువులు సదా కృతజ్ఞతలు తెలియజేయాల్సిందే. మంత్రసానులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు వ్యక్తం చేయడానికి మగ మహారాజులు మరువకుండా మరింత చొరవ తీసుకోవాలి.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

ఏడాది జాబిలి

ఏ కాంతిరేఖలూ ముక్కలవని
ఓ చక్కదనం !
ఏకాంతాన్ని ముక్కలు చేసే ఓ చిక్కదనం !
అమాయక శబ్ద సౌందర్యాన్ని వెంటేసుకొని
కొంటెనవ్వుల చిలిపిదనాన్ని కంట్లో వేసుకొని
నెలల పాపాయి ఎదుగుతున్నది
ఉంగా ఉంగాలన్నీ కేరింతలై పురివిప్పుతున్నవి
స్వరపేటికలో గాలి తన రూపాన్ని సవరించుకుంటున్నది
కొత్త చూపుల గాలాలకు వస్తువులన్నీ తన ఆట సాధనాలే.
ఏరివేత పారవేతల శబ్దమే జీవితం
ఇంటినిండా చిందరవందర దృశ్యాల గుచ్ఛాలే
ఎగరాలనే గెంతుల అడుగుల జాడలు
వింతగానే చెంతకొస్తుంటాయి
నెలవంక పున్నమైనట్లు
మనసు వాకిలిలో పిలుపు వాక్యాలన్నీ
అరచేతులకు లాగుతుంటే
ఆకలి తెలియనివ్వదు, ఆచేతనలో పడెయ్యదు
పనుల గడబిడ అంతా కబ్బేర్డు సొరుగుల్లో దాచి
దాగుడు మూతలైనప్పుడు
వెన్నెల ఎత్తుకునే పనిలోపడి నేను నవ్వుల చకోరమైపోతాను
పడిలో లేనప్పుడు మనస్సును
బిగించి ముచ్చట్ల
ముళ్ళేయమంటుంది.
నోట్లోని వేలు నాన్నమ్మకు ఒప్పజెప్పి
లోకాల సంతోషాలు తెచ్చి కట్టేస్తుంది.
నడకలు నాట్యానికి ఒప్పజెప్పి
పుట్టినరోజుకు సిద్ధమవుతున్నది.
-డా॥ కొండపల్లి నీహారిణి

- కొండపల్లి నీహారిణి
సెల్:9866360082

ఘంటారవం

కామాతురుల చరితలు
కన్నీటి వెతలే
లకుమ కోసం లోకువైన
కుమారగిరి కథలే.
మాపటికే లేకుంటే
రేపటి మాటెందుకు?
చెట్టు ఒట్టిపోతుంటే
అంటు కట్టుటెందుకు?
ఎదిగిన ఎత్తును కాదు
వేసిన ఎత్తును చూడు
పొందిన సత్తువ కాదు
చిందిన నెత్తురు చూడు.

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

నానీలు

బిందెలో నీళ్ళు నిల్
బీరుబాటిళ్ళైతే ఫుల్
ఓహో!
ఇది వేసవి కాలమే.
సాంస్కృతిక కార్యక్రమాలు
లేవని బాధా?
కరోనా
నృత్యం చేసిందిగా
పుస్తకాలు
ఎన్ని ఉంటే ఏమిటి?
చదివే పాఠకుడే
లేనప్పుడు!
అక్షరాలు
అల్లుకుంటేనే
టీ.వీ అయినా
సినిమా అయినా.
టామీ జెర్రీనే
ప్రపంచ ఆటా?
కరోనా కూడా
ఆడింది ఆరోగ్యంతో క్రీడ.

-చలపాక ప్రకాష్
సెల్:9247475975

'ఆనందలహరీ', 'మనం మరచిన మణి భంజికలు"ఆవిష్కరణ

స్థానిక త్యాగరాయ గాన సభ - కళా సుబ్బారావు కళా వేదిక లో మరోసారి తెలుగు తల్లి మనసు పరవశించింది. "ఆనంద లహరి" అనే సంస్థ ఆధ్వర్యంలో సహృదయ - సద్భావ రచయిత శ్రీ కోమరవోలు శేష శ్రీ రామచంద్ర మూర్తి గారు రచించిన "మనం మరచిన మణి భంజికలు" మరియు "అంతర్క్షువు" అనే పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. ప్రముఖ పద్యకవి "శ్రీ రాధశ్రీ" గారు మరియు రచయిత సోదరులైన శ్రీ కోమరవోలు శేష తల్ప రంగారావు గారి చేతుల మీదుగా ఈ పుస్తకాలను "తెలుగు భాషాభిమానులకు" అంకితం చేయడం జరిగింది. జ్యోతి ప్రజ్వలన చేసిన ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త "శ్రీ దైవజ్ఞ శర్మ" గారు మాట్లాడుతూ - "ఆ రామచంద్రుని ఆశీస్సులు ఈ రామంచంద్ర మూర్తికి ఉండాలని" ఆకాంక్షిస్తూ "రచయితకు సహకరించి ప్రోత్సహించిన వారి ధర్మ పత్ని ఉమాదేవి గారిని" అభినందిస్తూ - ఆశీస్సులు అందచేశారు. సభలో పాల్గొన్న శ్రీయుత వేమూరి శివరామ కృష్ణ ప్రసాద్ (జమునా గ్రామీణ బ్యాంక్ - పూర్వ చైర్మన్) ; నేటి నిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు, తెలుగు భాషను పల్లకి ఎక్కించడానికి ఎప్పుడు ముందుండే మరో ప్రముఖ రచయిత శ్రీ రఘుశ్రీ ఇంకా ఇతర ఆత్మీయ అతిథులైన "తెలుగు వెలుగు" బృంద సభ్యులు శ్రీ మాచిరాజు శ్రీ రంగం శేషశాయి ; శ్రీ పులిపాక వెంకట లక్ష్మీ కాంతారావు గార్లు రచయితకు అభినందనలు తెలియ చేసారు. కంద పద్యానికి ప్రాణం పోసే "శ్రీ రాధ శ్రీ" గారు "పద్య భాషణం" ద్వారా రచయితను అభినందిస్తూ - వేదికకు శోభ చేకూర్చిన వారందరినీ "పద్యాల మాలలతో" సత్కరించారు.

ప్రతిగా తన స్పందనను తెలియచేస్తూ రచయిత మూర్తి గారు రచనా వ్యాసంగంలో తనకు ప్రేరణ ఇచ్చిన కుమారుడు కృష్ణ కిషోర్ మరియు కమార్తె దుర్గా మాననలను తలచుకుంటూ తన రచనా ప్రయాణాన్ని వివరించారు. వీరిద్దరితో పాటు తాను రచించిన పుస్తకాలన్నీ తన "మానస పుత్రికలే" అంటూ చమత్కరించారు ...

కార్యక్రమంలో కురుగంటి కళాక్షేత్రం వారి బృందం ఆధ్వర్యంలో చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన - శ్రీ భిక్షు యాదవ్ గారి మిమిక్రీ - శ్రీ కాజా గారి ఇంద్ర జాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకున్నాయి.

సభా నిర్వహణ కార్యక్రమాన్ని కళారత్న మల్లం రమేష్ గారు చక్కగా నిర్వహించగా ప్రార్థనా గీతాన్ని ఇంకా సన్మాన పత్రాన్ని ప్రముఖ కాస్ట్ అకౌంటెంట్ దెందుకూరి జితేంద్ర రావు సమర్పించారు.

వందన సమర్పణ చేస్తూ మల్లం రమేష్ - సభకు రాలేక పోయిన శ్రీ పోలాప్రగడ జనార్దన రావు గారు ఫోన్ ద్వారా తెలియ చేసిన అభినందనలను ప్రస్తావించారు.

జాతీయ గీతంతో సభ విజయవంతంగా ముగిసింది.



పుస్తకావిష్కరణలో మాచిరాజు శ్రీరంగం శేషశాయి, పులిపాక వేంకట లక్ష్మీకాంతారావు, రఘుశ్రీ, బైస దేవదాసు, వేమూరి శివరామకృష్ణ ప్రసాద్, కొమరవోలు శేష శ్రీరామచంద్రమూర్తి, దైవజ్ఞశర్మ, రాధశ్రీ, కొమరవోలు శేషతల్ప రంగారావు, కళారత్న మల్లం రమేష్.

రచయిత కొమరవోలు శేష శ్రీరామచంద్రమూర్తి దంపతులను సత్కరిస్తున్న అతిథులు

నృత్య ప్రదర్శనలు చేసిన కురుగంటి కళాక్షేత్రం బృందం, నాట్యగురువు శ్రీమతి రాధికతో అతిథులు.

బంధాలన్నీ ఆర్థికమే

(కథ)

యాదయ్య బయటి నుండి వచ్చే సరికి తల్లీ కొడుకులు పెళ్లి కానుకలుగా వచ్చిన డబ్బు, కవర్ల నుండి తీయడంలో నిమగ్నమై ఉన్నారు. యాదయ్య మనసులో 'వాళ్ల వాలకం చూస్తే, ఎవరెంత డబ్బు కట్నంగా ఇచ్చారో, ఓ పట్టిక తయారు చేయాలనే ఇంగితం కూడా లేనట్టుంది.'

"మంగా! నేనొచ్చేదాకా ఆగలేకపోయారా? ఈ కవర్లు ఇప్పుడే చించడానికి అంత తొందరేమొచ్చింది?"

"ఎప్పుడైనా కానుకలుగా వచ్చిన డబ్బు, లెక్క చూసుకోవాల్సిందే కదా? మీరు మాత్రం తర్వాత వేరే ఇంకేం చేసేవారు?" పుత్రరత్నం జవాబు.

"అది కాదు సాయీ! ఈ డబ్బు, ఓ పద్ధతి ప్రకారం లెక్క పెట్టాలి. ఎవరెంత ఇచ్చారో ఓ పట్టికలో రాసి, వారింట్లో ఏదైనా శుభకార్యం జరిగినప్పుడు, అంతేనో లేక అంతకంటే కొంత ఎక్కువో చదివించవచ్చు. అప్పుడు మనం ఎవరికీ రుణపడి ఉండం" యాదయ్య అన్నాడు.

"మీవన్నీ చాదస్తపు ఆలోచనలు నాన్నా! ఈ రోజుల్లో అలాంటివెవరూ పట్టించుకోవడం లేదు." సాయిరాం మొండి వాదన.

"నీ మొత్తం పెళ్లి ఖర్చు నేనే పెట్టాల్సి వచ్చింది. దానికి కొంత అప్పు కూడా చేయాల్సి వచ్చింది. పెళ్లిలో కానుకలుగా వచ్చిన డబ్బుతో అంతో ఇంత అప్పు తీరుతుందని ఆశలు పెట్టుకున్నాను. మీ వాలకం చూస్తుంటే నా నెత్తిన శరగోపం పెట్టేట్టున్నారు." యాదయ్యలో ఆక్రోషం.

"అలా అనడానికి నీకు సిగ్గూ, శరం లేదూ? కన్న పాపానికి, పిల్లలను పెంచి పెద్దజేయడం, ఇంటికి పెద్దగా అది మీ బాధ్యత. ఈ డబ్బు మీద, నేనూ సాయి కూడా ఆశలు పెట్టుకున్నాం. మా పుట్టింటి పెట్టుపోతలకు నేనూ, తమ హనీమూన్ ఖర్చులకు సాయీ చెరిసగం తీసుకోవాలని ఎప్పుడో అనుకున్నాం. మీ అప్పులు, మీ బాధ్యత. వాటికీ ఈ డబ్బుకీ లంకె పెట్టకండి." మంగమ్మ కట్టె విరిచింది.

యాదయ్య తన కుటుంబ నేపథ్యంలోకి పరుగెత్తాడు. వెనుకబడ్డ ప్రాంతంలోని ఓ మారుమూల పల్లెలో పుట్టిన తన తండ్రి మైసయ్య, తన కుటుంబపోషణకై తమ కులవృత్తి దర్జీ పనిపైనే ఆధారపడ్డాడు. ఆ పల్లెటూర్లో తగినంత పనిలేక, కుటుంబాన్ని తమ ఊర్లోనే ఉంచి పొరుగు రాష్ట్రానికి వలస వెళ్లాడు మైసయ్య.

యాదయ్య స్కూల్ ఫైనల్ అయ్యేసరికి తన తోబుట్టువుల పెళ్లిళ్లు చేసి మైసయ్య చితికి పోయాడు. యాదయ్య చదువు అటకెక్కింది. తన తండ్రికి తోడుగా దర్జీ పనిలోనే స్థిరపడ్డాడు యాదయ్య. స్వతహాగా చురుకైన వాడవడంతో యాదయ్య,

అనతికాలంలోనే మంచి కటింగ్ మాస్టరుగా ఎదిగాడు. తన నైపుణ్యంతో ఉన్నత వర్గాలవారిని ఆకట్టుకుని, ఎక్కువ కూలీసంపాదించే స్థాయికి చేరుకున్నాడు. దర్జీపనితో పాటు బట్టలుకూడా అమ్మడం మొదలుపెట్టాడు. నాణ్యమైన బట్టలు, వేరే షాపులకంటే చవకగా లభ్యం కావడంతో జనాలు అక్కడే బట్టలుకొని, కుట్టడానికిచ్చేవారు. తన చిరునవ్వుతో కూడిన మాటలతో, సరళ స్వభావంతో డబ్బున్న క్లైంట్లను ఆకర్షించాడు యాదయ్య. తన నలుగురు అత్తయ్యల పెట్టుపోతలకుసహాయపడటమేగాక, ముగ్గురు సొంతకూతుళ్లకు కూడా మంచి సంబంధాలు చూసి పెళ్లిళ్ళు చేశాడు. కొడుకును మంచి కార్పొరేట్ కాలేజిలో యం.బి.ఏ. చదివించాడు. కొడుకు సాయిప్రసాద్ తన యం.బి.ఏ. తర్వాత ఓ బహుళదేశకంపెనీలో డిప్యూటీ మానేజరుగా చేరి, రెండేళ్లలో మేనేజర్ గా ప్రమోషన్ పొందాడు. సాయి, తన తల్లిదండ్రులకు శ్రమ కల్గించకుండా, ఓ అమ్మయిని ప్రేమించి, వారికి తెలిపాడు. ఆ అంతర్మత పెళ్ళికి అమ్మాయి తల్లిదండ్రులు ససేమిరా అనడంతో, యాదయ్యే వారి పెళ్ళి భారం తన నెత్తిన వేసుకున్నాడు. ఇప్పుడు సాయి, తన పెళ్ళికి వచ్చిన కానుకల డబ్బుపై కన్నేశాడు. దానికి యాదయ్య భార్య మంగ వత్తాసు. మంగకు ఖర్చు చేయడం మాత్రమే తెలుసు. దర్జానికి పోయి, తమ కూతుళ్ల పెళ్ళిళ్లకు కూడా ఎన్నో వ్యర్థ ఖర్చులు పెట్టించింది మంగమ్మ. మాట ఇచ్చినట్టు, తన పెళ్లికి, ఆర్థికంగా తన కొడుకు సహాయ పడకపోవడంతో యాదయ్యకు అప్పు చేయాల్సి వచ్చింది. అది తీరే మార్గం కూడా మూసుకుపోయింది. దీనంతటికీ తానిచ్చిన అలుసే కారణమా? తాను, తన పనిపై పెట్టిన శ్రద్ధ, కుటుంబ వ్యవహారాలపై పెట్టక పోవడంతో, వారు ఆడింది ఆట, పాడింది పాట అయింది. ఇంటి ఖర్చులు అదుపులో పెట్టుమని, తమ దాంపత్య మొదటి రోజుల్లోనే మంగను కట్టడి చేసుంటే, తనకు ఈ ఆర్థిక ఇబ్బందులు రాకపోవునేమో? అలాగే కొడుకు ఉద్యోగంలో చేరగానే, ఇంటి ఖర్చులకని నెలకింత ఇవ్వుమని నిలదీస్తే వాడి విచ్చలవిడితనానికి హద్దుండేదేమో?

తన బాధను ఎవరితోనైనా పంచుకుంటే తప్ప, ఉపశమనం కలిగేట్టు లేదు. వెంటనే బట్టలేసుకుని బయటికి నడిచాడు యాదయ్య. తమ ఇంటికి దగ్గర్లోని వైన్ షాపులో ఓ అర బాటిల్ విస్కీ, ఆ పక్క షాపులో, సంజుకోవడానికి కావలసినవస్తువులు కొని, ఆ నగరంలో తనకున్న ఒకే ఒక ఆప్తమిత్రుడు, నరహరి ఇంటి వైపుకు అడుగులు వేశాడతను. ఇద్దరు మిత్రులు ఓ గదిలో సెటిలై, మందు సీస మూత తీశారు. ఒక్క పెగ్ లోనికి పోగానే, యాదయ్య లోని ఆవేదన బయటికి వచ్చింది. "నరహరీ! మా వాళ్లు నన్ను నట్టేట ముంచిగాని, తృప్తి పడేట్టు లేరు. ఒంటి చేత్తో ఈ సంసార నావ ఎన్నాళ్లని నడపను?" యదయ్యలో మందు, తన ప్రభావం చూపిస్తోంది.

"ఇప్పుడంత కష్టమేమొచ్చింది యాదయ్యా? నీ షోరూం బాగానే నడుస్తోందిగా?"

"అంత సీన్ లేదు నరహరీ! ఇప్పుడు చాలామంది, బ్రాండెడ్, రెడీమేడ్ దుస్తులవైపు మొగ్గు చూపుతున్నారు. దానివల్ల మా వ్యాపారం మందగించింది. మా ఖర్చులకు తగ్గ ఆదాయం మాత్రం వస్తోంది. ఈ పరిస్థితుల్లో మా అబ్బాయి పెళ్ళికని చేసిన అప్పు తీర్చడం గగనంగా ఉంది."

"అదేంటి ! మీ అబ్బాయికి, ఇంటి అప్పు తీర్చే బాధ్యత లేదా?" నరహరి మరో ప్రశ్న సంధించాడు.

"వాడిలో అంత జవాబుదారీతనమే ఉంటే, ఇలా నీ ముందు బయటపడేవాడినా? పెళ్లి కాక ముందే ఒక్క పైసావిదిల్చనివాడు, పెళ్లైన తర్వాత మాత్రం నా బాధ్యతలో పాలు పంచుకుంటాడా?"

"అలా నీకు నువ్వే అనుకుంటే ఎలా? అప్పు తీర్చడానికి నెలకింత ఇవ్వాలని ఖండితంగా షరతు విధించు. నీ మాటవినకపోటే నాలాంటి వాళ్లని నలుగురిని పిలువు. మేమతన్ని ఇంటి బాధ్యత వహించేలా ఒప్పించే ప్రయత్నం చేస్తాం.

ఐనా వినకుంటే, తాడో, పేడో తేలుద్దాం" నరహరిలో ఉద్రేకం.

"అలా అంటే వేరు పడడమేగా? తల్లిదండ్రులతో పొసగక వేరుపడ్డ పిల్లలను చూశాను కాని, తండ్రే పిల్లలను ఇంటినుండిగెంటేసిన ఉదంతాలు చూడలేదు."

"నీ కొడుకు తానుకూడా సంపాదిస్తున్నప్పుడు, ఇంటి బాధ్యతలో కూడా పాలు పంచుకోవడం సమంజమే. ఇక లోకులంటావా? వారు నీవెలా ఉన్నా విమర్శిస్తారు" నరహరి కుండ బద్దలు కొట్టాడు.

"ముందే మా ఆవిడకు నేనంటే అలుసు. ముగ్గురు ఆడ కూతుళ్ళ తర్వాత పుట్టాడని, అబ్బాయిని చిన్నప్పటినుంచే గారాబం చేసింది. వాడిని నేనేమన్నా అంటే మా మధ్య సంబంధాలు ఇంకా చెడుతాయి."

"చూడు యాదయ్యా! లోగడ కార్ల్ మార్క్స్ అనే మహానుభావుడు "లోకంలో ఉన్న బంధాలన్నీ ఆర్థిక బంధాలే" అనిసూత్రీకరించాడు. ఊరికే నీకు నీవే మథన పడుతూ నీ భార్యా, కొడుకును అదుపులో పెట్టక పోతే జీవితాంతం బాధపడవలసి వస్తుంది.

అలాగే ఎదుటి వారికి, వారి బాధ్యత పై అవగాహన కల్పించాలి. లోకంలో, నడిచే ఎద్దునే పొడిచే అలవాటుంది. దానికిఎదురు తిరగడమొక్కటే మార్గం." నరహరి విశదీకరించాడు. అప్పటికి బాటిల్ ఖాళీ అవడంతో యాదయ్య మంచి జోరుమీదున్నాడు.

"నరహరీ! ఇక చూసుకో నా తడాఖా!" అంటూ తన ఇంటి వైపుకు అడుగులు వేశాడతను. అతని అడుగుల్లో ఓ కొత్తబలం. అది కేవలం అతను పుచ్చుకున్న మందు వల్ల మాత్రమే వచ్చింది కాదు.



-అంబల్ల జనార్దన్
సెల్:09987533225/
8850349858

తల్లీ కొడుకులు పెళ్లి కానుకలుగా వచ్చిన డబ్బు, కవర్ల నుండి తీయడంలో నిమగ్నమై ఉన్నారు. యాదయ్య మనసులో 'వాళ్ల వాలకం చూస్తే, ఎవరెంత డబ్బు కట్నంగా ఇచ్చారో, ఓ పట్టిక తయారు చేయాలనే ఇంగితం కూడా లేనట్టుంది.'

అహం

(కథ)

రాముని పల్లి అనే ఊరిలో కవిత మరియు లక్ష్మీ అనే స్నేహితురాళ్లు ఉన్నారు. కవితది చాలా పేద కుటుంబం .లక్ష్మి ది చాలా డబ్బు ఉన్న కుటుంబం. కవిత చాలా మంచిది. అందరితో మంచిగా మాట్లాడుతుంది మరియు కలసిమెలసి ఉంటుంది.కాని లక్ష్మి ఎవ్వరితో మాట్లాడదు. ఎవరైన మాట్లాడిస్తే అహంతో మాట్లాడుతుంది .

లక్ష్మికి డబ్బు ఉందనే అహంతో అందరితో గొడవ పెట్టుకుంటుంది .కవితకి డబ్బు లేకున్నా ఉన్నదానిలో ఎవరికైన లేకపోతే సహాయం చేస్తుంది . కాని లక్ష్మికి డబ్బు ఉన్న ఎవ్వరికి సహాయం చేయదు.లక్ష్మి ఎప్పుడూ కవితతో గొడవ పెట్టుకుంటుంది .

ఒకరోజు కొంతమంది స్నేహితురాళ్లు కవితవారి ఇంటికి వచ్చారు .అందరు నవ్వుతూ కలిసిమెలసి ఆనందంగా ఉన్నారు.కాని లక్ష్మి వారి ఇంటికి ఎవ్వరు వెళ్ళరు. కవిత ఇంట్లో ఉన్న వారిని లక్ష్మి చూసింది . తనకు నచ్చలేదు .అందరు లక్ష్మిని చూసి భయపడతారు.ఎందుకంటే తను ఎప్పుడు గొడవ పెట్టుకుంటుంది .

" అందరు కవిత వారి ఇంటికి వెళ్ళుతున్నారు ఆమెతో చాలా మంచిగా మాట్లాడుతున్నారు . కాని నాతో ఎవ్వరు మాట్లాడడం లేదు , మా ఇంటికి ఎవ్వరు రావడం లేదు . ఎందుకు ? " అని తనలో తాను అనుకుంది .

లక్ష్మిఎప్పుడు ఎవ్వరింటికి వెళ్ళదు. ఆరోజు కవిత వారి ఇంటికి వెళ్ళి కొపంగా

" మా ఇంటికి ఎవ్వరు రావడం లేదు .వాతో ఎవ్వరు మాట్లాడడం లేదు . " ఎందుకు ? " అని అడిగింది.

"నువ్వు ఎప్పుడు డబ్బు ఉందనే అహంతో ఉంటావు.ఎవ్వరిని మాట్లాడనివ్వవు .ఎవరైన మాట్లాడిస్తే అహంతో మాట్లాడుతావు.కవిత అందరిని మాట్లాడిస్తుంది మరియు అందరితో కలసిమెలసి ఉంటుంది .అందుకే మీ ఇంటికి ఎవ్వరు రావడం లేదు.మాట్లాడడం లేదు " అందరు అన్నారు.

అప్పడినుండి లక్ష్మి అందరితో కలిసిమెలసి ఉంటుంది.. అహంతో మాట్లాడడం లేదు. పేదవారికి సహాయం చేస్తుంది.

.నీతి : - మనుషులకు అహం ఉండకూడదు.

-సారుగు శ్రీజ
తొమ్మిదవ తరగతి
జక్కాపూర్ ఉన్నత పాఠశాల
సిద్దిపేట జిల్లా, సెల్ .9959007914



చీకటి
జీవితంలో
జ్ఞాపకాలు
నక్షత్రాలు-
అనుభవం
చందమామ!

-డా॥విప్లవ్‌దత్ శుక్లా
సెల్:9849185878

ఆహ్వానం

మహిత సాహితీ
శ్రీ త్యాగరాయ గానసభ, హైదరాబాద్
సంయుక్త నిర్వహణలో-

శ్రీ నకరికంటి వేంకటేశ్వరరావు
పుట్టినరోజు సందర్భంగా
'నరికంటి పురస్కారాల ప్రదానోత్సవం-కవిసమ్మేళనం'

7 మే, 2022, శనివారం, సాయంత్రం 6 గంటలకు
కళా లలిత కళావేదిక, శ్రీ త్యాగరాయగానసభ, చిక్కడ పల్లి, హైదరాబాద్

సభాధ్యక్షులు
డా. వడ్డెపల్లి కృష్ణ
ప్రముఖ కవి, సినీగేయ రచయిత, సినీ దర్శకులు

ముఖ్య అతిథి
శ్రీమతి డా. వై. జయప్రద
హెచ్.ఆర్ డైరక్టర్, అవంతి గ్రూప్ కళాశాలలు

విశిష్ట అతిథి
శ్రీ కళా వి.ఎస్. జనార్దన మూర్తి
అధ్యక్షులు, ప్రపంచ రికార్డుల శ్రీ త్యాగరాయ గానసభ

పురస్కార గ్రహీతలు
శ్రీమతి డా. శారదా పూర్ణ శొంఠి
సంగీత సాహిత్య సమలంకృత
శ్రీ కె.యల్. కామేశ్వర రావు
చమత్కార కవి
శ్రీ బైస దేవదాసు
నేటి నిజం పత్రికా సంపాదకులు

తొలి పలుకులు
శ్రీమతి స్వాతి శ్రీపాద
అధ్యక్షులు, మహిత సాహితీ

ప్రఖ్యాత కవయిత్రుల కవి సమ్మేళన నిర్వహణ
శ్రీమతి తమిరిశ జానకి
గౌరవాధ్యక్షులు, మహిత సాహితీ

వందన సమర్పణ
శ్రీమతి శిష్టా మాధవి
శ్రీ నకరికంటి పురస్కారాల ప్రదాత

శిష్టా మాధవి
కార్యదర్శి, మహిత సాహితీ

కళా శారధ దీక్షితులు
కార్యదర్శి, శ్రీ త్యాగరాయ గానసభ

ప్రగతి రథ కందెనలు ..!

భరతజాతి ప్రగతిరథ చక్రాలు
పరి'శ్రమ'లు నడిపిన 'శ్రమ'లు
చెమట చుక్కలేగా రథ కందెనలు !

కండలతో బండల్ని సహితం..
పిండి చేసే శక్తి చెలిమలు..
యంత్ర మర్మమెరిగిన కార్మికులు !

అతనో మండే శ్రమాగ్ని కణం..
బొగ్గ గనుల్లో వెలుగుల దీపం..
యంత్రాల్ని నడిపే ఇంధనం !

శ్రామికుడు సెలవడిగితే..
కార్మికుడు అలిగి తొలిగితే..
ఊపిరాడక జనం తల్లడిల్లు !

కార్మికుడెపుడూ కార్యశూరుడే..
శ్రామికుడెపుడూ శ్రమ త్యాగే..
కర్షకుడెపుడూ మట్టిలో మాణిక్యమే !

కార్మిక ఆరోగ్యమే దేశ సౌభాగ్యం..
శ్రామిక చైతన్యమే జాతి జాగృతం..
కర్షక ఆనందభాష్పాలే అన్నామృతం !
కార్మికుల్ని కృతజ్ఞతల వర్షంతో..
శ్రామికుల్ని అభినందనల వాసతో..
కర్షకలోకాన్ని ప్రేమానందాల జల్లుతో..
పాదాభిషేకం చేయాలి పౌరసమాజం..
కాదంటే భాయం భాళీ కడుపుల లోకం !

-మధుపాళీ
9949700037

శ్రమజీవి నెత్తుటికన్నీళ్లు.

భానుడు మేల్కొనగానే వెతికేది... ఈ శ్రమజీవినే.
అతడు కన్నులు తెరిస్తేనే కదా ...
ప్రపంచం పరుగులు పెట్టేది.
అవనిపై పాదం మోపితేనే కదా...పుడమితల్లి
ఎదపై మెతుకు పూలు పూసేది.

అరిగిపోయిన అతడి చేతి రేకల్ని తాకినప్పుడల్లా..
బతుకు బాధలన్నీ వరుసపెట్టి దర్శనమిస్తాయి.
కళ్లనుండి జారుతున్న నెత్తుటికన్నీళ్లను
చూసినప్పుడల్లా త్యాగాల జీవితం కనిపిస్తుంది.

విశ్వాన్ని నీ వేలుపట్టుకొని నడిపిస్తున్నావు.
దండలో దారంలాగా నీ కష్టమెవ్వరికి కనిపించదు.
బుక్కెడు బువ్వకోసం నువ్వు చేస్తున్న రణం
మహాభారత యుద్ధంకన్నా గొప్పదే.!

చెమటలు కక్కుతున్న నీ దేహాన్ని చూస్తుంటే...
మెరుస్తున్న కోహినూర్ వజ్రంలా కనిపిస్తావు.
నీ ఇంటి సుఖాలన్నీ చెల్లాచెదురై పరుచుకున్నా..
అందని కోరికలన్నీ గాలిలో తెలుపోయినా..
పరివారపు స్వప్నాలన్నీకష్టాలవరదల్లో
కొట్టుకుపోయినా..నాలుగు పైసలకోసం
నీ ధర్మపోరాటంలో నువ్వెప్పుడు ఓడిపోవు.
బడాబాబులు అల్లిన సాలెగూటి వలలో..
నీ శ్రమచిక్కుకొని నెత్తుటి కన్నీరుని కారుస్తుంది.!
నీ కోసం రాసిన రాజ్యాంగంలోని హక్కులన్నీ
బందీలుగా మారి నిను తలచుకుంటూ
కన్నీరును కారుస్తున్నాయి.

దేహాన్ని యంత్రంగా చేసి ఫ్యాక్టరీలను
పరుగులు పెట్టిస్తావు.
రుధిరాన్ని చమురుగా పోసి చక్రాలబండివై
ప్రపంచపు బతుకు బండిని నడిపిస్తావు.
ఊపిరి తీగల్ని ఆధారంలేని నింగికి ముడేసి..
ఎత్తైన భవంతులను నిర్మిస్తావు.

కొలిమిలో మండుతున్న ఎర్రని నిప్పు కనికవై..
ఇనుపచువ్వలా మారిన ఉక్కు కార్మికుడవై..
భారీ బ్రిడ్జిలకు బాటసారివి అవుతువావు.
ప్రాణాన్ని గాలిలో దీపంలా పెట్టి...
కడుపులో నకనకలాడుతున్న ఆకలి మంటలను..
కారం మెతుకులతో చల్లార్చుకొని..
బాధ్యత ఎరిగిన కార్మికుడవై కదులుతావు.

నీ చరిత్ర పుస్తకాలన్ని తిరగేసి చూస్తే
గాయాల పేజీలే దర్శనమిస్తాయి.
అనునిత్యం జ్వలిస్తున్న నీ గుండె
కార్మికజెండాని కప్పుకొని ఎర్రనిపతాకమై
రెపరెపలాడుతుంది.
కార్మిక దినోత్సవం శ్రమజీవికి చైతన్య రథమై
బతుకుప్రయాణం సాఫీగా సాగాలని ఆశిస్తూ..

-అశోక్ గోనె
9441317361.

వారు మౌనాన్ని బుజాలపై మోస్తుంటారు

వాళ్ళు పలుగు పార పట్టనిదే
అవనిపై ఆకాశ హర్మ్యాలు కొలువు దీరవు
వాళ్ళు చెమట చుక్కలు చిందనిదే
వెలుగుల జిలుగులు విరజిమ్మవు
వాళ్ళ అడుగులు అవనిపై పడనిదే
విశాల దారులు విప్పారి పరుచుకోవు
వారి పాదాలు తాకితేనే కదా !
పచ్చదనం పొలాల్లో పరుచుకునేది
వారి చేతులు సాపితేనే కదా !
రత్నాల సిరుల రాశులు పోగుపడేది
వాళ్ళ హస్త రేఖలు అరిగితేనే కదా !
కలిగినోళ్ళ ఇండ్లల్లో బాసన్లు మెరిసేది
గనుల్లో, బురద మడుల్లో
ఇటుక బట్టీల్లో , పాకీపనుల్లో
విశ్వవ్యాప్తమై విహరిస్తూ
పనిలో కాయాత్తి లా కరిగిపోతూ
అభివృద్ధిలో గంధపు చెక్కలా అరిగిపోతూ
కండ్లల్ల నీళ్లు కనురెప్పలు దాటకుండా
వారు మౌనాన్ని భుజాలపై మోస్తుంటారు

స్వేచ్ఛా పావురం ఎగిరి ఇన్నేండ్లయినా
పల్లు పట్టిన అంగీలు
చిల్లు పట్టిన లుంగీలు
రంగులు వెలిసిన రవికలు
చీకి పోయిన చీరలు
నెర్రబారిన గోడలు
కన్నాలు పడిన పై కప్పుల తో
ఇప్పటికీ కష్టజీవుల ముఖచిత్రం అదే తీరు
వారి కష్టాల అలలు తీరానికి చేరట్లేదు
వాళ్ళ తనువులన్నీ అప్పుల చెట్టుకు చిక్కుకొని
గబ్బిలాల్ల వేలాడుతున్నాయి

జెండాలు మారినా "ఎజెండా" మారట్లేదు
నేతలెందరు మారినా వారి గీత మారట్లేదు
క్యాలెండర్ లు మారినా వారి కూటి తిప్పలు తీరట్లేదు
వాళ్ళ నిరాశల తోటలో కుసుమాలు పూయట్లేదు
వారి చీకటి జీవితాలలో
వెలుగు రేఖలు సోకట్లేదు .
(మట్టి పరిమళాలకు" మే డే" శుభాకాంక్షలతో)

-తాటిపాముల రమేష్
7981566031

కార్మికాదేవా నమో!

చెమట చుక్కలు విత్తి చెలకలను పండించి
అవని కడుపులు నింపు అన్నదాతా నమో!

తనువునింజను చేసి తపసుతో వస్త్రాలు
నేసి మానము గాచు నేతగాడా నమో!

అరచేత బ్రాణాల నెరి తాటి మొగిలెక్కి
కల్లు కుండలు దింపు గౌడవీరా నమో!

తిరిగి వచ్చెదనన్న భరవసము లేకున్న
భూగర్భ గనిజొచ్చు బొగ్గుకార్మిక నమో!

సతము చోదనమందు సరుకులను,యానికుల
పదిలంగ చేర్పించు వాహ్య చోదక నమో!

కురుమ! గోపాలకా! కుమ్మరీ!కమ్మరీ!
చాకలీ!మంగళీ! చర్మకారీ! నమో!

భట్రాజ! ముదిరాజ! భవనకార్మిక రాజ!
చలనచిత్రపు రంగ శ్రమవీరుడా నమో!

వేలాయుధము దాల్చి విద్యార్థులందరను
సన్మార్గమున నడుపు సత్త గురుడా నమో!

విశ్వ బ్రాహ్మణ నమో! విశ్వ కర్మా నమో!
యంత్రకారీ నమో! చిత్రకారీ నమో!

సకలకుల వృత్తులను సాదరించుతు జగతి
కల్యాణమున వరలు కర్మ దేవా నమో!

-డాక్టర్ అడిగొప్పుల సదయ్య
9963991125

పాడెను మే డే కార్మికుడా

మండిన రక్తం చిందిన స్వేదం
జీవిత కష్టం కార్మికుడా

అలసట తెలియక అభయం లేక
అందరి సౌఖ్యం ఎ పుడు వీడక
బతుకు చీకటి లో
వెలుగు కోసమై
ఎత్తిన పిడికిలి కార్మికుడా

నమ్మిన చట్టం విడిచిన హస్తం
మనసున గాయం హక్కులు మాయం.
కార్మికుడా

దేశ సంపదకు నువ్వే మూలం
నీ త్యాగానికి సాక్షం కాలం
నీ కష్ట మె కద అందరి జీవం కార్మికుడా

అవమానాలే నీ దారి లో
అవస్థలు ఎన్నో
నీ పయనం లో
కష్టానికి తగిన ప్రతిఫల మే ది
కార్మికుడా

మోసాలెన్నో ద్వేషాలెన్నో
నీ శ్రమ దోచే దారులు ఎన్నో
వెట్టి చాకిరీ నిను వెక్కిరించే
జీవితమంతా నీతో సాగే
కార్మికుడా

హక్కులు కాలే డొక్కలు ఎం డే
పిల్లల భవితలు కన్నీరొలకే
రైలు బండ్లను లాగినావులే
బతుకు బండిని నడపలేక నువు
కుప్పకూలితివి కార్మికుడా

ఎత్తిన చేయితో బిగించు పిడికిలి
హక్కుల సాధన ధ్యేయం నీది
వెట్టిచాకిరీ విముక్తి గీతం
పాడెను మేడే కార్మికుడా

-సిరిసిల్లా గఫూర్ శిక్షక్
9849062038

'మేడే' 'మేడే'!

పల్లవి: కార్మిక దినోత్సవం 'మేడే' 'మేడే'!
కర్మవీర ఘనోత్సవం నేడే నేడే ॥కా॥
చికాగో నగరంలో
చిక్కుల పనిభారంతో
నలుగుతున్న కార్మికులు
రగులుతున్న శ్రామికులు
సోషలిస్టు కమ్యూనిస్టు
సోదర పార్టీలతో
భుజం చరిచి- నిజం తరచి
భుజంగాల మాదిరిగా
భూస్వామ్య వ్యవస్థపై
బుసగొట్టిన సుదినమిదే!
శ్రమ దోపిడి చేస్తున్న
సంపన్నుల ఫ్యాక్టరీల
పొగగొట్టం పొగరణచగ
పోరాడిన సుదినమిదే! ॥కా॥

పరిమితమన్నది లేనీ
పలుగంటల శ్రమలనెల్ల
ఎనిమిది గంటలు చేయగ
వికమైన కార్మికులు
ఎలుగెత్తిన సుదినమిదే!
ధ్వజమెత్తిన సుదినమిదే!
తుచ్ఛ పాలనా రంగం
తుత్తునాకులే గురిపెట్టగ
కార్మిక సోదరరక్తం
కాలువలై ప్రవహించగ
తడిసిన చొక్కాలన్నీ
ఎర్రెర్రని జెండాలై
చిర్రెత్తిన విప్లవాలు
శిరసెత్తిన సుదినమిదే!
॥కా॥

- డా॥వడ్డేపల్లి కృష్ణ
సెల్: 9246541699

'మేడే'

మేడే మేడే అని
ఎలుగెత్తి చాటుతున్నారు బడా బాబులు
శ్రమైక జీవుల సౌందర్యాన్ని
చాటునుండీ చూస్తున్నారు చూసీ చూడనట్టు!
అగ్గిపెట్టెలో పట్టే ఆనాటి
నేత చీరలకు నేతగాళ్ళకు అగ్గిపెట్టారు
అంతోటి పెట్టెలో అనేక "చిప్"లను పట్టించి
"చే"నేత చీరల నేతకు కంప్యూటర్ డిజైన్లు అతికించిన
"నేతలకు ఆ పలుచని చీరల కతలు ఏం తెలుసు-
మట్టి కుండలకు రంగులద్ది నగిషీలు దిద్ది
ఇంటినిండా పేర్చుకునే నేటి నాగరికతకు
అమృణ్యయ పాత్రల విలువ ఏం తెలుసు-
ఆ వెనక ఉన్న కుమ్మరి గారి ఘోషేంతెలుసు-
ఆనాడు మంగలాయన శిగతరిగేవాడు
కాల మహిమతో యంత్రాలతో ఎవరి తల వారే
గొరుక్కుంటున్న అశుభ తరుణమిది.
మరి ఆ వెనకున్న నాయీ బ్రాహ్మల ఘోష ఎవరికి పడుతుంది-
రేయింబవళ్ళు సుత్తితో సన్నని సెగలలో వింత వింత సొమ్ములు చెక్కి
విదేశీయులను సహితం మెప్పించిన స్వర్ణ సొగసులకు విలువేది-
ఆ వెనకనున్న స్వర్ణ కారులకు భరణమేది-
పెళ్ళి పేరంటాలలో సన్నాయి నొక్కులకు లేని విలువ
కర్ణ భేరీలు తెగి పడునట్లు డప్పు ఢబ ఢమ లకా!
అంతటి విద్వాంసులకు అవమానం కాదూ!
బఫేల పేరిట ప్లాస్టిక్, తగరపు పళ్ళాయి
ఎంగిళ్ళ కలబోతల వల్ల విస్తళ్ళ కుట్టుబడి వెనుకబడింది.
పండి ఎండిన బాదపాకులు,
మోదుగాకులు కలిపి కుట్టే పనివాళ్ళ వేళ్ళు స్తంభించాయి.
కార్మికులకు బాసటని యంత్రాలు, కలపమన్నాడు
"చాచా నెహ్రూ సూది మోపే జాగాలో
గునపాలు దించే నిరంతర యాంత్రికత కాదు.
కమ్మరి, కుమ్మరి, కంసాలి, చాకళ్ళకు, మంగళ్ళకు,
గొల్లలకు యంత్రాల పోటీ!
ఊళ్ళలో వాళ్ళకు పనిలేని తనం
వారే నగరాలకు వలస వచ్చిన నైట్ వాచ్‌మన్‌లు.
ఇదేనా "మేడే" అంటే.

-డి.పంకజ మల్లిక్
సెల్: 9866065462

చైతన్య సారధి...శ్రీ శ్రీ

భావ కవిత్వం నుంచి
అభ్యుదయ
కవిత్వం లోకి
పయనించి
సాహిత్యంలో
నూతన ఒరవడిని ..
సృష్టించిన చైతన్య సారధి...!
హృదయ కంపనానికి
మాటల రూపాన్ని
ఇవ్వడం తెలిసిన
అరుదైన వ్యక్తిత్వం తో..
ప్రపంచపు బాధనంతా
తన ..రచనలో
పలికించిన అద్భుత వ్యక్తి ...!
దిక్కరించి అడిగే
ప్రజల గొంతుకులకు
ప్రశ్నల...సమాధానాలై నిలిచి ..
హద్దులు ఆజ్ఞలు లేని
కవిత్వాన్ని సృష్టించిన
ఆదర్శప్రాయుడు..!

అంధకారంలో
మగ్గుతున్న వారందరికీ
ఉషోదయాన్ని
తెచ్చిన వైతాళికుడు..!
తన కవిత్వంతో
ప్రపంచంలో ఉన్న
కుళ్లును ...
ఏరి పారేసిన శక్తి ..!
తన గళంతో
కళ్ళుండీ చూడలేని
వారికి దృష్టిని
ప్రసాదించిన జ్ఞాత....!
తెలుగు కవిత్వంలో
మైలురాయై..
దిక్సూచిగా నిలిచిన ..
అక్షర ప్రదాత "శ్రీ శ్రీ"..!

-సునీత బండారు
9440671530

శ్రమసౌందర్యం

మట్టి వాసన తెలుసు
వెట్టి వాసన తెలుసు
చెమట చుక్కల హారంగా
చేతులనిండా పని నింపుకుని
పొద్దస్తమానాలను పొదిమి పట్టి
కాలాలను కరవాలంగా ధరించి
ఉత్పత్తుల్లో ఉదయిస్తుంది.
ఆకలి వాసన తెలిసి
అన్నపుమద్దను అరచేతిలో సృష్టిస్తుంది
ముద్ద కడుపుకందక చేజారిపోతుంది
కమురు వాసన తెలిసి
ఫ్యాక్టరీలో కనలిపోయి
కళాత్మక వస్తువుల సృష్టికర్తగా నిలుస్తుంది
అందిరాని ఫలితం వెక్కిరిస్తుంది.

హక్కులున్నాయని తెలుసు
దరిజేరక దోపిడీ పాలవుతున్నాయని తెలుసు
గొంతును కుట్టేస్తూ
లాఠీలు జైళ్లు నోరుతెరుచుకుంటాయని తెలుసు
సౌందర్యం చుట్టూ
కుప్పలు కుప్పలుగా పోగుపడిన చెమట చుక్కల్లో
కంటినిండా కనిపించే ఇంద్రధనస్సుల్తో
దేవుడిని సృష్టించినా
గుడిముందు అడుక్కునే తలరాతను
రాసిందెవరో తెలుసుకోలేకపోతుంది



-కోడం పవన్‌కుమార్
9848992825

పదండి ముందుకు

మే డే
అంతర్జాతీయ కార్మిక సోదరుల
దినోత్సవం
అంతర్జాతీయ శ్రామికుల దినోత్సవం
రక్తాన్ని స్వేదం గా మార్చి
మనకు నీవలు చేసేప
కార్మిక సోదరులకు
పట్టాభిషేకం నేడే
మొదటిసారి మనదేశంలో
మద్రాసు లో మేడే జరిగింది
వసంత శోభితమై
వడగాలులు వీచేకాలంలో
శ్రామికుల దినోత్సవం

నేను సైతం అంటూ
శ్రమదానం చేసే
కార్మిక సోదరులకు
మండే ఎండల్లో కాయకష్టం చేస్తూ
చలి మరగదుల్లో,
కారులో తిరిగే వారికి
ఊడిగం చేస్తూ
ఏమి కూడగట్టుకోని
నిస్వార్థ జీవులకు
పట్టాభిషేకం నేడే

ఏ దేశం చరిత్ర చూసినా
పరపీడన పరాణత్యమే
కార్మిక సోదరుడు చిందించిన
స్వేదానికి విలువకట్టగలమా

ఎంతకాలం ఈ శ్రమ దోపిడీ
పదండి ముందుకు
దూసుకుపోతున్న
మండే సూర్యులకు

-అరుణ దేవులపల్లి
9000606889

మే డే వర్ధిల్లాలి

స్వేదంతో సంపద
సృష్టించే బ్రహ్మాలు
మనుసలో మరికి లేక
మనుషుల మరికి ని
సైతం శుభ్రం చేసే
పారిశుద్ధ్య సైనికులు వారు
దేశాన్ని రక్షించేది సైనికులు
అయితే
దేహాన్ని రక్షించే సైనికులు వీరు
అయి
మానవ నైజం కూలివాళ్లకు
డిమాండ్ వచ్చింది
అని నిట్టూర్పు తో నిసుకుంటున్నాం
పరుగుతున్న ధరల
క్షీణిస్తూ న్నా శక్తి
లంకె కుదరక
తల్లడిల్లి పోతున్న కూలి జనం
మార్చు చెప్పిన విలువ కు
మూలం శ్రమ అదే సత్యం
దాన్ని మర్చి ప్రచారీకరణ
ఆరోగ్య ప్రదాలు వారు
పెట్టుబడి దారి ముసుగులో
సోషలిస్ట్ చర్యలు
అదేశిక సూత్రాల్లో
కప్పి వేయబడి
పుట్టెడు మెతుకుల
కోసం పాట్లు పడుతూ
ఆకలి కేకలు
తో అరుస్తూ
కార్మిక చట్టాలు
ఉన్నవాడి కి చుట్టాలు
ప్రమాదం లో కార్మికుల కష్టాలు
వర్ణించ జాలవు
ఓట్ల రాజకీయం లో
యూనియన్ నాయకుల
చతురత లో ఓడి పోతూనే
ఉన్నారు
ఎర్ర సైన్యం ఎర్ర సిరా
నాలో పరిగెత్తుతుంది
ఎప్పుడు నేనే
నీకోసం నా శ్రమ
ఈ ప్రపంచ సంపద
సృష్టించేది నేను
నాకు నీడ కరువైన
నా రెక్కలు తొడిగేందుకు
బువ్వను అడ్డుకోకు
ఆకలి లేకుండా చూడు
ఊపిరి ఉన్నంత వరకు
శ్రమిస్తూనే ఉంటాను
చదువుకున్న వాళ్ళల్లో
శ్రమ కూడా దోపిడీ చేయబడుతున్న వేళ
అటు కెక్కి కూసున్న పట్టాలు
బూజు దులుపాలి

-ఉమశేషారావు వైద్య
9440408080

కన్నీటి వర్షం....!

నాన్నా....!?
నీ జ్ఞాపకాల చితిలో...
ప్రతి దినం నేను
వడలిపోయిన గులాభి పువ్వునే!?

బ్రతుకు బండి నడుపుటకు
చేసే పోరాటంలో....!
అప్పుడప్పుడు
నీ ప్రతిబింబం అలా
గాలిని తాకి వెళ్లిపోయే
మేఘాలు లాగా కనిపిస్తుంటే

నా నయనం నాయగార జలపాతమై...!
రెప్ప చాటున వాసచినుకులు ...
అతివృష్టి ని ఆలపిస్తున్నాయి నాన్నా!

నా మొదటి నేస్తం నువ్వైతే!?
నా రెండో నేస్తం ఈ కవిత్వమే...!!!

ఏ గిలీ ఏన్నా...!
నాకు మరణ మృదంగంలా
వినిపిస్తుంటే....!?

చటుక్కున శ్వాస ఆగిపోయి
నీ దరి చేరాలనిపిస్తుంది నాన్నా...!

అయినా....!!!
చేదిరిపోని గుండె
బండ లా మారిపోయింది నాన్నా....

-శ్రీ గంగ
అనంతపురం జిల్లా

అక్షరాలను అడగాలని ఉంది

ఆణిముత్యాల అక్షరాలై
తెలుగు భాషకు వెలుగుపంచి
దేశభాషలందు లెస్స అనిపించుకుని
అనంత సాహితీ సంపదను ప్రోగు చేసిన
అజంత భాషాక్షరాలు మీరు..!

'శ్రీ సరస్వతీ సిద్ధం నమః'అని..
చిట్టి చేతులు దిద్దుతుంటే..
అంచెలంచెలుగా ఎదిగే మీ అస్తిత్వం..
గండపెండేరాలు తొడిగించుకునే పాండిత్యం
అత్తెసరులో ఆహుతవుతవుతుంటే
కిక్కురు మనకుండా ఊర్కుంటారెందుకు??..!

పరభాష మాధ్యమాన్ని గద్దెనెక్కిస్తూ
తెలంగాణపు ఉన్నతికి పాటుపడే..
ధీరులమని చెప్పుకునే పాలకులను
పల్లెత్తు మాటనని మీ ఔన్నత్యం..
మీ ఉనికిని మీరే ఊబిలో దించుతున్న వైనం..!!

నేర్చుకున్న భాషనంత పలు సాహితీ ప్రక్రియల్లో
పంచుతున్న తరాన్ని చూసి మురుస్తూ
అసలుకే మోసమనే మాటనే...మరిచారా..??
ఆసక ఈ సాహిత్యం చదివేదెవరని??
స్వగతానికి... ప్రశ్నెప్పుడైనా వేసారా??

కలవరాన కళ్ళు తెరిచి ఒళ్ళు విరిచి చూస్తే..
కార్పోరేటు బడుల్లో కానకుండ పోయామనీ..
సర్కారు బడుల్లోనైనా..
సదరు అస్తిత్వాన్ని నిలబెట్టకోవాలనే
నిజం మీకు తెలుస్తుంది..
'క్షరం'కాని అక్షరాలుగా మీ ఆప్యాయతలు
అనవరతం పంచండి..
తెలుగు తల్లి కంటి దివ్వెలై వెలుగండి...!!!

-సావిత్రి రంజోల్కర్
9833497812.

మాండలికపు ఆలాపనతో సాగిన "పడమటి గోదావరి రాగం"

కవిత్వం, కథ ఏదయినా ఒక విధంగా గమనిస్తే గొప్ప ఆలాపనలే. అయితే ఆ ఆలాపన ఎక్కడిది? ఏ ప్రాంత వాసులది? ఏ గుండెల ఆవేదనలోనిది? ఏ ప్రజల సమస్యలలోనిది అనేది మాత్రం కథకు పెద్దపీట వేస్తుంది. పడమటి గోదావరి రాగం" అనే కథలు చదువుతుంటే నిజంగా మరో లోకంలో విహరించినట్లే ఉంది. కారణం ఆ యాస, భాష చదవరులను కట్టి పడేస్తుంది. ఏ కాలంలో నైనా తెలుగు సాహిత్యంలో మాండలికంలోని కథలకు పెద్దగా ప్రాముఖ్యత కనిపిస్తూనే ఉంటుంది. చాలా మంది కవులు మాండలికంలో రచించాకే తమ ప్రతిభ పదిమంది హృదయాలలో చేరుకోగలిగారు అనేది వాస్తవం. ఉదాహరణకు సినీ దర్శకుడు వంశీ పసలపూడి కథలు, కె.ఎన్ వై పతంజలి వంటివారు చేసిన ప్రయోగాలను చెప్పుకోవచ్చు. కాకుంటే ఏ ప్రాంతలోనైనా సమస్యలు ఒక్కటే. ఆవేదనకు కారణాలు దాదాపుగా ఒక్కటే. కాకుంటే ఒక్కో పక్షీ ఒక్కోలా పలుకుతుంది అన్నట్లు ఒక్కో ప్రాంతవాసులు అక్కడున్న వాతావరణం, పరిసరణలను అనుసరించి వారి యాస వుంటుంది. కాకుంటే ఏ కథకైనా వస్తువు ప్రదానం,అందులోని సమస్య, వాటికి కనిపించిన పరిష్కారమే ప్రదానం యాస, ప్రాంతం అనేవి రెండవ కోవకే చెందుతాయనేది నా అభిప్రాయం.

ఈ కథా సంపుటిలో రచయిత శ్రీనివాసరాజు గారు తాను పుట్టిన ప్రాంతాన్ని, తనకు ఎంతో పరిచయం ఉన్న పరిస్థితుల్ని ఈ కథల్లో ఎంతో అద్వితీయంగా మలిచారు.తాను పుట్టి పెరిగిన వాతావరణపై గల ప్రేమను కూడా ఈ కథల్లో మనకు చూపారు. ముఖ్యంగా గోదావరి ప్రాంతంలో కోప్పడినా అందులోని ఆప్యాయత కనిపిస్తుంది. వ్యంగ్యం ఎక్కువగా కనిపిస్తుంది. ఆ యాసలోని హావభావాలు, దీర్ఘాలు ఒక్కోసారి మనల్ని కడుపుబ్బ నవ్విస్తాయి. కాకపోతే గోదావరి యాసపై వచ్చిన కథలు కానీ, పాత్రలు కానీ పెద్దగా మనకు ఎదురవ్వలేదనే చెప్పాలి. అందుకేనేమో గోదావరి యాసలోని అచ్చెరువొందే పాత్రల ఔచిత్యం ద్వారా రచయిత కడుపునిండా భోజనమే పెట్టారనిపించింది ఈ కథలు చదువుతుంటే. అలాగని ఈ కథలన్నీ ఒకే మూసలో ఉంటాయా అంటే కాదు. ఒక వస్తువుకు వేల్లాడుతుంటాయా అదీ కాదు. ఇంతెందుకు ఒక్కసారి కథాగమనంలోకి వెళదాం..

"తాతారావు గారి బెంజికారు" కొనుక్కున్న ఒక భూస్వామి చూపిన హెూదా, వలకరింపు పేరుతో వ్యంగ్యాస్త్రాలను సంధించే తీరు ఒక రకంగా చిరాకు మరోపక్క తెలియని ఆసక్తి రేపుతుంది. చాలా మంది ఏది కొనా లన్నా తమ హెూదాకు సరిపడా కొనాలనే తాపత్రయంతో కొంటారు. తర్వాత వారు ఎదుర్కునే సమస్యలు తప్పించుకునే క్రమంలో చేసే విన్యాసాలు కడుపుబ్బ నవ్విస్తాయి. అని తెలిపే తీరు ఎంతో మానసికోల్లాసాన్ని కలిగించేలా సాగింది.

మరో కథ "ఇల్లాలి సన్యాసం' లో గొప్పగా యాస సాగింది. సంసారంలో ఎదురయ్యే నిత్య తలనొప్పులుంటాయి. వాటితో వేగలేక అలాగని ఎదిరించి నిలవలేక చివరకు సన్యాసంలో చేరిపోవడానికి దారులు చూపించే తీరులో సాగింది. ఈ కథలో వెటకారం సషాలాకి అంటడం విశేషం. మహిళలు సంసారంలో ఎన్ని సమస్యల్ని తట్టుకో లేకున్నా, టీవీ సీరియల్స్ చూసుకోవచ్చనే ఒక్క ఆశ, మేకప్పులపై వారి ఆసక్తి ఎంతటి భారాన్నయినా భరించగలిగేలా చేస్తుంది అనే విషయం చెప్పడంలో రచయిత శ్రీనివాసరాజు ప్రతిభ కనిపిస్తుంది.

ఆడపిల్లల్ని వద్దు అనుకునే అనేకమం దికి చెంపపెట్టు కథ "మళ్ళీ ఆడపిల్లే పుట్టింది" కథ. తల్లి తండ్రులపై వారు చూపే ప్రేమ ఈ కథకు మూలాంశం.

సుజాత, సుబ్బలక్ష్మి ఫోనులో జరిగే సంభాషణ సీరియళ్ళు, వంటావార్పూ, చీరలు నగలూ, నుంచి ఉదయం నుండి ఏం జరిగిందీ అనే విషయాలు మాట్లాడుకునే తీరులోనే పాత్రల మార్పును కూడా జోడించి మరింత అచ్చెరువొందేలా చేసిన కథ "సెల్‌ఫోన్ సుబ్బలక్ష్మి'

ఆస్తులు లేకుంటే లేదని ఏడుపుల్ని చూస్తూనే ఉన్నాము. కాకుంటే ఆస్తులుంటే కూడా పంచుకోలేక ఏడుపులు, తిట్లు, రక్త సంబంధాలైనా ఒకరినొకరు పెట్టుకునే శాపనార్థాలు పెట్టుకోవడం వంటి సంఘటనలు ఎంత సహజమైనా విషయాన్ని తెలిపే తీరులో చక్కని చాక చక్యం చూపిన ఈ రచయిత కలం అద్భు తం. అదే "జెక్కంశెట్టి సూర్రావు-ఎకరం పొలం" కథ.

తర్వాతి కథ "పెళ్ళి గోల". నేడు ప్రతి ఇంట్లో సాగుతున్న గోలే ఇది. వినాయకుడి పెళ్ళికి ఎన్నో విఘ్నాలు అన్నట్లు ఈ రోజుల్లో మగపిల్లల పెళ్ళికి లక్షల విఘ్నాలు మనం ఎదుర్కుంటున్నారు. ఆ విఘ్నాల తాలూకు గోల ఈ కథలో మనల్ని కడుపుబ్బ నవ్విస్తుంది. అలాగని సీరియస్ కథలు లేవా అంటే లేకేం? ఉన్నాయనే చెప్పాలి. కష్టజీవుల కథలు, మధ్యతరగతి జీవితాల్లో ఎదురయ్యే సమస్యలు వంటి కథలను రచించి దాదాపుగా కథను అన్ని కోణాల్లో నిశితంగా గమనించి రచించారనే తెలపాలి. ఇంకా మూడురూపాయలు, 'వారఫలం', నాన్నమ్మ, స్నేహం వంటి ప్రతి కథా పాఠకుల్ని తట్టి పలకరించే రీతిలో సాగాయి. చక్కని యాస, సమయస్ఫూర్తి, చలోక్తి, వ్యంగ్యం ఒక్కటేమిటీ అన్నింటినీ కలిపి వడ్డించిన విందులా సాగిందీ సంపుటి. ఇంత చక్కని కథల్ని అందించిన రచయిత శ్రీనివాసరాజు ఇందుకూరి గారికి నా అభినందనలు.

-ప్రతులకు :
శ్రీనివాస్ ఇందుకూరి
సెల్: 9209077789

-శైలజామిత్ర
9290900879

కార్మిక లోకం

నింగిని తాకే సమస్యల వలయంలో
తలపై బతుకు మూటగట్టుకొని
పట్టణానికి చేరిన వలస ఓ కార్మికులరా

పొట్ట చేతబట్టుకుని ముల్లె
మూట సర్దుకుని కన్నతల్లి ఒడిలోకి
బాట పట్టిన ఓ వలస కార్మికులరా

కరోనా మహమ్మారి వలలో పడి
జానెడు పొట్ట కోసం కానరాని
ప్రాంతాలకు బ్రతుకు కోసమే
వలస వచ్చిన నిరుపేద కార్మికులరా

ఎక్కడి వరకు నీ ప్రయాణం?
మీ కష్టాన్ని అర్థం చేసుకునే నాధుడు లేడు?

మీ బాధలను వ్యక్తపరిచే దెవరు ?
మీకు సాటిగా ముందు నిలిచింది ఎవరు?

మీ రెక్కల కష్టంతో ఆర్థిక
పరిస్థితి అభివృద్ధి చెందినది
మీ చెమట చుక్కలతో
వేల కోట్లకు పడగెత్తిన
యజమానులు ఎంతరో?

మీ దీనావస్థను చూసి బాధ పడిన వారెవరు?
మీ బాట గమనాన్ని చూసి దారి చూపేదెవరు?

వలస కార్మికులరా మీకు వందనాలు
మీ రెక్కల కష్టానికి అభినందన చందనాలు.

-కమ్మరి శ్రీనివాస చారి
9177324124

ఆహ్వానము

వసీరా కవిత్వ సంకలనం
సెల్ఫీ ఆవిష్కరణ

వేదిక: రవీంద్ర భారతి,
పైడి జయరాజ్ ప్రివ్యూ థియేటర్
తేది: 08-05-2022 ఆదివారం
ఉదయం 10గం॥లకు



ఆవిష్కర్త:
కె.శివారెడ్డి,
సరస్వతీ సమ్మాన్ అవార్డు గ్రహీత
ప్రత్యేక అతిథి:
మామిడి హరికృష్ణ,
సంచాలకులు, తెలంగాణ సాంస్కృతిక వ్యవహారాల శాఖ
అధ్యక్షులు:
సంపిని సిధారెడ్డి,
తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు
తొలిప్రతి స్వీకారం:
పెమ్మరాజు గోపాలకృష్ణ

వక్తలు
డాక్టర్ కాళ్లకూరి శైలజ
సతీష్ చందర్
ముక్కామల చక్రధర్
సీతారాం
అద్దేపల్లి ప్రభు
ఆప్తవాఖ్యం
కందుకూరి శ్రీరాములు

కరోనా కథలు

పేగుబంధం

అప్పటికీ కోవిడ్ వంతొమ్మిది వ్యాధి ప్రపంచమంతా వ్యాప్తి చెంది ప్రతి దేశాన్ని ఫుడ్ బాల్లా ఆడుకుంటోంది. లింగ, వర్ణ, ప్రాంత, ధనిక, పేద, కుల, మత విచక్షణ లేకుండా తారస పడ్డ మనిషినల్లా కబళింపచేస్తోంది.

ఈ పూటకు లేక కడుపు చేత పట్టుకొని బతికే బడుగు జీవుల బతుకులు బజారున పడి "అన్నమో! రామచంద్రా!" అని అల్లాడిపోతున్నారు. వలస కూలీ లెందరో రోడ్ల వెంబడి పోలీసుల లారీల రుచులు చూస్తూనే, తల్లిలాంటి తమ పల్లెలకు వయనమయ్యారు. అందులో పసిపాపల నుండి పండు ముదుసలి, యువతులు యువకులతో పాటు గర్భిణీలెందరో తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని రాత్రీ పగలనక కాళ్లకు చెప్పులున్నా లేకున్నా ఒకటే నడక.

ఈ నడకలో కండ బలమున్న వారు ముందు కెలుతున్నారు, లేని వారు చతికిలబడిపోతున్నారు. వాళ్ళ ఆస్తి అంతా ఒక మూటనే దాన్నే నెత్తిన పెట్టుకుని మోయలేనంత ఇబ్బంది పడుతూ తమ గమ్యాన్ని చేరడానికి విఫలప్రయత్నం చేస్తున్నారు.

సునామీలాంటి వేగవంతమైన నడకలో పయోవృద్ధులు, శారీరక బలహీనులు "ఈ నడక మా వల్ల కాదనీ, భవిష్యత్తులో బతకాల్సిన మీరు వెళ్ళండి" అని పొంగి వస్తున్న దుఃఖాన్ని కంటి రెప్పల కిందే అదిమి పట్టుకొని వారిని పంపించేస్తున్నారు. మిగిలిన వారిల్లో బతికిన వారెందరో పోయిన వారెందరో తెలియదు. ఈ వ్యాధికి బంధువులు మిత్రులు శత్రువులు ఎవరైనా ఒక్కటే, శత్రువుకైన ఈ వ్యాధి సోక కూడదు. అంతా అగమ్య గోచరమే.

అందరి కందరూ నా ప్రాణం దక్కితే చాలు అనుకునే వారే. వరుల గురించి ఆలోచనలు ఏ కోశానా లేవు. ఇంతటి ఘోర విపత్తు ఇంత వరకెప్పుడూ రాలేదేమో.

మోయలేక నడవలేక తమ చంకన ఉన్న పసివారి పాల కోసం ఒకవైపు, పండు ముసలి వాళ్ళు దాహార్తితో మరోవైపు అలమటించి పోతున్నారు.

వీరందరినీ రక్షించడానికి ఆయా దేశ రాష్ట్ర ప్రభుత్వాలు మొబైల్ వాహనాలు ఏర్పాటు చేశాయి. ఇందులో పోలీసులు. రెవెన్యూ వాళ్ళు అత్యధిక శ్రమకోర్చి వారికి తాత్కాలిక నివాస స్థలాలు, భోజన వసతులు కల్పించి ఆదుకుంటున్నారు.

వీరిలో అనారోగ్యులైన వారికి ఆరోగ్య శిభిరాలు ఏర్పాటు చేశారు. అంతేగాక వైరస్ లక్షణాలు ఉన్నట్టు ఏమాత్రం డౌట్ ఉన్న వారిని పరీక్షించి అవసరమైతే క్వారంటైన్ లేదా ఐశోలేషన్‌కు పంపి ఆరోగ్య సేవలందిస్తున్నారు.

అలా అందించే సిబ్బందిలో కౌసల్య అయమ్మ ఒకరు. ఐశోలేషన్‌లో ఆ రోజే చేరిన ఓ పేశంటుని చూసి ఆయమ్మ అవాక్కైపోయింది. ఆ పేశంటును చూడగానే తనకు గతమంతా గుర్తుకొస్తోంది

××××

నాకు ఒక్కగానొక్క కొడుకు, వారు 3 సం॥రాల వయసులో ఉన్నప్పుడే వాడి నాన్న పుట్టినోడి భారాన్ని నామీదేసి, తిరిగి రాని లోకాలకెళ్లి పోయాడు.

నాకు వచ్చిన మంత్రసాని (ప్రసూతి చేయించడం) విద్యతోనే బతుకు బండిని సాగిస్తుంది.

గత పది సంవత్సరాల క్రితం ప్రభుత్వ ప్రసూతి కేంద్రంలో ఆయమ్మ పోస్ట్ కూడా వచ్చేసింది.

దీంతో ఆర్థికంగా కాస్త కుదుట పడి నా బాబును మంచి చదువులు చదివించా, వాడి తెలివి తేటలతో రెవెన్యూ శాఖలో గుమస్తా ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం వచ్చిన సంవత్సరం లోపలే వాడికి పెండ్లి కూడా చేశా.

పెండ్లి అయిన తర్వాతే అసలు సమస్య మొదలైంది.

వలస కూలీ లెందరో రోడ్ల వెంబడి పోలీసుల లారీల రుచులు చూస్తూనే, తల్లిలాంటి తమ పల్లెలకు పయనమయ్యారు

"ఏంటి! సునీల్, మీ అమ్మ ఇంకా ఆయమ్మ వృత్తిని చేయడం, మాకైతే బాగనిపించడంలేదు, ఇలా అయితే మా అమ్మాయిని పంపించలేమని" హెచ్చరిస్తున్నారు.

నా బాబు సునీల్ కూఆ "అమ్మా నాకు చాలా ఇన్సల్టుగా అనిపిస్తోందే"; అని చెప్పి నేను చేస్తున్న ఆయమ్మ పనిని మానేయమని పట్టుబట్టాడు.

కానీ ఏ బతుకు దెరువు లేనప్పుడు ఆదుకున్న ఈపని నాకెంతో పవిత్రమైంది. నా కుటుంబాన్ని ఆదుకొన్న ఈ వృత్తిని నేను వదలనని మొండి కేయడంతో "అలా అయితే మేము ఈ ఊరే విడిచి వెళ్లిపోతాము" అని చెప్పటంతో పొరుగూరులోని ఆసుపత్రి సెంటర్‌కు నేనే బదిలీ చేయించుకొని నా కొడుకూ కోడలికి దూరంగా ఉండసాగాను.

నాకు మనవడు పుట్టాడని తెలిసి కోడల్ని చూడటానికి ఆమె ప్రసూతి అయిన ఆసుపత్రి కెళ్ల, ఆ బుడతడు అచ్చంగా వాడి తాత (నా భర్త) లాగే ఉన్నాడు. ఎంతో ముద్దొచ్చి వాడి బుగ్గను అలా తాకా, అంతే తోక తొక్కిన తాచులా సన్న లేచి "ఛీ ఛీ అడ్డమైన వాళ్లు.." అలా నానా తిట్ల దండకంతో మళ్లీ భవిష్యత్తులో ముఖం చూసుకోలేనన్ని మాటల గునపాలతో గుండెను పొడిచేసింది. ఇదంతా నా సుపుత్రుడు సునీల్ ముందరే జరిగింది. భార్య మాటలకు వాడిలో కనీస కదలిక లేదు. ఇది గమనించి నేను కళ్ళలోని దుఃఖాన్ని కడుపులో దాచుకుని వచ్చేశా..

"ఏమమ్మా కౌసల్యా! ఆ ట్రెచ్చర్ ఇటు లాక్కురా!" అన్న మేడం పిలుపుతో గాని వర్త మానంలోకి రాలేకపోయా.

ఆ పేశంటు ఎవరో కాదు నా పేగు తెంపుకొని పుట్టిన కొడుకు సునీలే. రోడ్డున పడి రోధిస్తున్న అభాగ్యులను ప్రభుత్వ శిభిరాలకు తరలిస్తున్న రెవెన్యూ సిబ్బంది అనారోగ్యాల పాలైతే, వారికేమైనా కరోనా వైరస్ సోకిందేమోనని పరీక్షించడానికి తీసుకొచ్చారు. అందులో భాగంగానే సునీలుని కూడా ఆస్పత్రికి తెచ్చినట్టున్నారు.

నేను మొత్తం కనబడకుండా (పిపిఈ) వ్యక్తిగత జాగ్రత్త కోసం వాడే దుస్తులతో మాస్క్ కప్పేసుకు న్నాను. నన్ను మా సిబ్బంది తప్ప ఎవరూ గుర్తించలేరు. తన కన్న కొడుక్కే ఇలా సేవ చేయాల్సి వస్తుందని కలలో కూడా నేను ఊహించుకోలేదు.

×××

అలా సునీల్ ఆరోగ్యం కుదుట పడగానే డిశ్చార్జ్ అవుతున్న సమయంలో పేగు బంధం ఆపుకోలేక సంద్రమంతటి దుఃఖం సునామీలా వచ్చేసి "బాబూ సునీల్!" అని బిగ్గరగా గావుకేక వేశా.

వాడి అంతరాల్లో ఎక్కడో దాగిన కన్న ప్రేమ "అమ్మా! నీవా తల్లీ! ఈ పాపిని క్షమించవమ్మా!" అని నా పాదాలను తాకుతూ" అమ్మా! బుద్ధి గడ్డితిని, కళ్ళకు గర్వమనే పొరలొచ్చి నిన్ను బయటకు పంపా నమ్మ! ఈ రోజు నీ విక్కడ చేస్తన్న సేవ ఎంత గొప్పదో తెలిసింది. నీవెంతో మందికి జీవం పోస్తున్నావమ్మా! నిజం గా నీవు దేవతవు..." అని అలా రోదిస్తూ పొగుడుతూనే ఉన్నాడు.

-దారం గంగాధర్
సెల్:9848384777

చెట్టు

చెట్లు చేయు మేలు చెప్పనలవు కాదు
ఏమని ఎంతయని చెప్పగలము
ఆయువు ఉన్నవరకు తాను ఉపయోగపడి
త్యాగమునందు వానికి ఎవరు సాటిరారు
మేఘాలను కిందికి రప్పించి
వర్షమును ఇచ్చును
భూతాపమును తగ్గించి మేలు చేయును
పసిడి పంటలకు కారణము చెట్లు
మానవుల మేలు కోరును మంచి చెట్లు
అమ్మలా ఆదరించి అండగా ఉండును
భువికి వర్షమును తెచ్చి
సమస్త జీవుల దాహము తీర్చును
స్వార్థము లేని చక్కని జీవులు
పలువిధాలుగా ఉపయోగపడుతూ
ప్రజల మేలు కోరును

-చిలువేరు జయశ్రీ
6వ తరగతి
ZPHS MATOOR.

చదువు గేయం

చదువు గేయం
పుస్తకాల కొట్టుకి వెళ్లాను
పుస్తకములను కొన్నాను
దేవుడి దగ్గర పెట్టాను
జ్ఞానం ఇమ్మని మ్రొక్కాను
ఆచార్యుల దగ్గరికెళ్లాను
అన్ని విషయాలు తెలుసుకున్నాను.
శ్రద్ధగ వాటిని చదివాను
నోటు బుక్కులో వ్రాశాను.
పుస్తకముల బొమ్మలు చూశాను
సొంత కథలను రాశాను
రాసి నందులకు గురువేమో
బహుమతులెన్నో ఇచ్చారు.
వ్రాసిన కథలను పత్రికకు
పంపగ వచ్చెను నా కథలు
కథలను చదివిరి తోటి బాలలు
ఆదర్శంగా నన్ను తీసుకొని
వారు కథలను రాశారు.
అందరు కవులమె అయ్యాము

-పడిగె ఐశ్వర్య
6వ, తరగతి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
గుర్రాలగొంది, జిల్లా సిద్దిపేట.

కవిత్వం-మొగ్గలు

మనసుకు గాయమైనపుడల్లా గేయమై
లేపనం రాసి సేద తీర్చే దివ్య ఔషదం
స్వాంతనచేకూర్చే స్నేహ పరిమళం కవిత్వం.

బాధాతప్త హృదయాలకు భరోసా ఇస్తూ
పిల్లతెమ్మెరల ఆహ్లాదాన్ని కలిగించేది
కష్టాలను ఇష్టాలుగా మార్చే కావ్య కన్యక కవిత్వం.

కార్మిక, కర్షక వెతలకు బాసటగానిత్యం నిలుస్తూ
వారి స్వేద బిందువులకు ఆత్మ బంధువులయ్యేది
నేటి వ్యవస్థలో వారి పక్షాన పోరాడేది కవిత్వం.

ప్రజాస్వామ్య విలువలు వలువలు కోల్పోతే
ప్రజల సాధక బాధలను వెలుగెత్తి చాటి చెప్పేది
నాయకుల కుటిలత్వాన్ని నిగ్గుతేల్చేది కవిత్వం.

ముమ్మరులు దేశం పై బరి తెగించినపుడల్లా
సాయుధ దళాల వెన్నుతట్టి చైతన్యం నింపేది
భారతీయ ఐక్యతను దేశ సరిహద్దులో నిలిపేది కవిత్వం.

కామాంధుల పైశాచికత్వానికి బలౌతున్న
ఆడబిడ్డల మాన,ప్రాణాలకు కవచంగా నిలిచేది
ఆడది అబల కాదు సబలని స్ఫూర్తినిచ్చేది కవిత్వం

-కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

చేతనత్వం

నల్ల రాతి శిలలకు
ఊపిరి లేదన్నదెవరు?
చేయి తిరిగిన శిల్పినడుగు
అతని ఊహాలోకాల్లో
శిల్ప సుందరి నాట్యం చేస్తుంది

నల్లరేగడి మట్టికి
జీవం లేదన్నదెవరు?
రాటుదేలిన రైతునడుగు
అతని ఆరుగాలపు సేద్యంతో
మనకు ప్రాణభిక్ష పెడుతుంది

రాగి తీగకు
కదలిక లేదన్నదెవరు?
విద్యుదయస్కాంత తరంగాలతో
విద్యుత్ వాహక చోదకమై
వెలుగు పూలు పూస్తుంది

కొయ్య బొమ్మలకు
ప్రాణం లేదన్నదెవరు?
కళను నింపిన కళ్ళతో చూడు
రంగు రంగుల హంగులతో
సర్గము తొణికిసలాడుతుంది?

చేతనత్వం లేనిదెవరికి
చేవ గల్గిన ధీరులనడుగు
సృజనతత్వము లేనిదెవరికి
ఆలోచనల నాపరాయి మీద
మస్తిష్క పొరలను సానబెట్టి చూడు!

-గంగశ్రీ
9676305949

అనాధ బాలలు

మాసిన బట్టలతో
మాడిన మోములతో
మదినిండా గాయాలతో
మాట్లాడించే వారు లేక
మౌనంగా వుంటున్నరు.

కాలే కడుపులతో
కన్నీటి ధారలతో
కన్నోళ్లు తెలియని బాధతో
కుమిలి పోతున్నరు
కుదేలవుతున్నరు.

కామానికి చేసిన తప్పుతో
కలకాలం వేదనతో
క్రుంగిన కాయముతో
కాలమెళ్ళ దీస్తున్నరు
కాటికి చేరువవుతున్నరు.

ఓ తల్లిదండ్రులారా..!
కనమన్నదేవరు
వొదిలేయమన్నదేవరు
ఒంటరిని చేయమన్నదేవరు
ఒడిని దూరం చేసిందెవరు

ఆనందాల కొరకు
ఒక్కటైతిరి
అభం శుభం తెలియని
మాకు జన్మనిస్తిరి
సాదుకొలేక,చంపుకోలేక
చెత్త కుప్పల్లో,
చేద బావుల్లో
ముళ్ల పొదలల్లో
మురుగు కాలువల్లో
పడేస్తిరి
పక్కకు తప్పుకుంటిరి
బతుకును బలి చేస్తిరి
అనాధగా మాకు
లోకాన ముద్ర పడేలా చేస్తిరి..

ఆనందం మీకు కలిగే
కన్నీళ్లు మాకు మిగిలే
ఆపండి ఆపండి
మదమెక్కిన మీ ఆటలు..!
మళ్లీ ఆగం చేయకండి
మాలాంటి బాలల బతుకులు..!!

-పసుల.శంకర్
9542181301

యుద్ధోన్మాదం

యుద్ధం గురించి క్రొత్త గా ఏమి వ్రాయాలి
యుద్ధం గురించి క్రొత్త గా ఏమి చెప్పాలి
ఎటుచూసినా మానవ కళేబరాలు
ఎటుచూసినా దుఃఖపు ఛాయలు.

ఒకరు గెలుపొందుతారు
ఒకరు ఓటమిపాలౌతారు
కొన్ని సార్లు ఎవరు గెలవరు
కొన్ని సార్లు ఎవరు ఓడిపోరు
బట్టలు చింపుకొని వెనుతిరుగుతారు
యుద్ధం గురించి క్రొత్త గా ఏమి వ్రాయాలి
ఏ చరిత్ర చూసినా ఏమున్నది గర్వ కారణం
నరజాతి సమస్తం పరపీడన పరాయణత్వం
ఎంతకి తీరని ఉన్మాదం
ఎంతకి తీరని రక్తదాహం
ప్రాణానికి ప్రాణం
రక్తానికి రక్తం
ఇదెక్కడి యుద్ధ ధర్మం.

అమాయకమైన మనుషుల భయాందోళన
పసిహృదయాలపైన పగ ప్రతీకార భావన
కష్టతరమైన మనుషుల మనుగడ
ఆగేది ఎపుడు ఈ రగడ.

నివాసాలు కోల్పోయిన మానవులం
నిలువనీడలేని బాల్యం
దోచుకోబడిన యవ్వనం
తెగిపోయిన తాళి బంధనం
ఇంకా ఏమి మిగిలింది
శవాలదిబ్బలు తప్ప
రక్తపుటేరులు తప్ప

-అరుణ దేనియల్
9000606889

పుస్తక సమీక్షలు

కబంధుడి ఆత్మ సౌందర్యాన్ని ఆవిష్కరించిన అనుమాండ్ల..!

ప్రముఖ కవి, విమర్శకులు, ఆచార్య అనుమాండ్ల భూమయ్య గారు కబంధుడి ఆత్మ సౌందర్యాన్ని ఆవిష్కరిస్తూ.. విలక్షణమైన లఘు కావ్యాన్ని **"కబంధ మోక్షం"** పేరుతో వెలువరించారు. పద్యం..గేయం.. విమర్శ వంటి ప్రక్రియల్లో తమ అసమాన ప్రతిభను ప్రదర్శించి సుమారు 44 గ్రంథాలను ప్రకటించిన అనుభవం భూమయ్య గారికి ఉంది. భూమయ్యగారిపై వచ్చిన గ్రంథాలు కూడా ఉండటం విశేషం.. సుమారు ఇరవై వరకు ఇతర గ్రంథాలకు ఆయన సంపాదకత్వం వహించారు. అనేక సాహితీ పురస్కారాలను సొంతం చేసుకున్న భూమయ్య గారు తెలుగు విశ్వ విద్యాలయానికి లోగడ వైస్ ఛాన్స్‌లర్‌గా సేవలందించారు. పద్య రచనలో అపారమైన అనుభవాన్ని గడించిన ఆయన పద్య కావ్యాల్లో పదలాలిత్యాన్ని.. రసజ్ఞతను చూడగలం.. ఇప్పుడు ప్రకటిస్తున్న 'కబంధ మోక్షం' లఘు కావ్యం.. కోసం విలక్షణమైన, వైవిధ్యమైన కవితా వస్తువును ఎంపిక చేసుకుని పాఠకులను మెప్పించారు.

రామాయణంలోని ఓచిన్ని కథను ఆధారం చేసుకుని "కబంధమోక్షం" పద్య కావ్యానికి జీవం పోశారు. వికృత రూపం.. విపరీతమైన తిండి.. శాపవి మోచనం.. పశ్చాత్తాపం వంటి కదంబుడి లక్షణాలను ఆలంబన చేసుకుని ఇందలి రచనను కొనసాగించారు.

సీతాదేవిని రావణాసురుడు అపహ రించిన కీలక సమయం లో.. సీతాన్వేషణలో ఉన్న రామలక్ష్మణులకు మార్గ దర్శనం చేసిన ఉదారుడు కబంధుడు.. తేటగీతిలో కొలువుదీరిన ఈ కావ్యంలో కవి

భూమయ్య గారి రచనా వైచిత్రిని కొనియాడకుండా ఉండలేము.. కబంధుడు ఎవరనే చర్చకు తెర లేపకుండా.. కబంధుడి ఉదార స్వభా వాన్ని.. వికృతంగా ఉన్నప్పటికీ.. ఆయన ఆత్మ సౌందర్యాన్ని వెలికి తీయడంలో భూమయ్య గారు సఫలీకృతులైనారు.

రంగనాథ రామాయణంలో కబంధుడిని దివ్యుడని పేర్కనడం.. కల్పవక్షం సైతం వాల్మీకినీ అనుసరించడం వంటి అంశాలను ప్రస్తావించకుండా కబంధుడి భాగ్య విశేషాలను ప్రస్తుతిస్తూ ప్రస్తావించగా ప్రయత్నం చేయడం ప్రశంసనీయం..

కబంధుడి యొక్క విశిష్ట వ్యక్తిత్వం కవి భూమయ్యగారిని ఆకర్షించడం.. అద్భుత భావనలతో ఆయన మాటలుగానే ఆర్ష మార్గంలో కబంధుడి గురించి రచనను చేశారు.

జటాయువుకు దహన సంస్కారం చేసి ఉత్తమ గతులు కల్పించాడు. మునిచేత శపింపబడి వికృత రూపం పొందిన కబంధుని చేతులు నరికి రాముడు దహనం చేసి స్వర్గప్రాప్తిని కలిగించాడు. తనను చంపబూనిన వానికి ఇంతటి ఉత్తమ స్థితిని కల్గించడం రాముని మానవత్వానికి, మహిమకు నిదర్శనం! అగ్ని సంస్కారం.. శాప విమోచనం.. రెండూ వాల్మీకి రామాయణంలో శ్రీరామ-కబంధుల కథ అరణ్యకాండ ఐదు సర్గల్లో ఉంది. రావణాసురుని జాడనెరిగిన వాడు సుగ్రీవుడని.. అతనితో స్నేహం చేస్తే మేలు జరుగుతుందని రామునికి కబంధుడు చెప్పడం.. ఈ కావ్యంలోని విశేషం! ఓ విధంగా కబంధుడు చేసిన ప్రత్యుపకారం.. కబంధుని కథలో రెండు అంశాలు.. ఒకటి.. రాముడు కబంధునికి శాప విమోచనం చేయడం.. రెండోది సుగ్రీవునితో స్నేహం చేస్తే సీత జాడ తెలుసుకోవటం సులభమవుతుందని కబంధుడు సూచిం చడం.. ఇలా కబంధుని మంచితనాన్ని.. రాముని ఉపకారాన్ని.. కబంధుని ప్రత్యుపకారాన్ని ఈ కావ్యంలో ఆచార్య భూమయ్యగారు ఆవిష్కరించారు.

స్థూల శిరుడను ముని శాపం వల్ల శాశ్వత వికృత రూపమొందిన కబంధునికి.. రాముడు కబంధుని రెండు భుజాలను ఛేదించి.. దహనం చేయగా కబంధునికి శాప విమోచనం కావటం వంటి అంశా లను ఇందలి పద్యాల్లో పొందుపరిచారు.

కబంధుడు శాప విముక్తుడై, నిజరూపం దాల్చి.. స్వర్గానికి పోయే అంశాలనే ప్రధానంగా ప్రస్తావించారు కనుక 'కబంధ మోక్షం' అని గ్రంథానికి నామకరణం చేయడం అన్ని విధాలా సమర్థనీయంగా ఉంది.

వాల్మీకి కథ మధ్యలో చెప్పినట్లు రామలక్ష్మణులను కబంధుడు స్వాగతించిన ఘట్టంతో ఆరంభమై.. మంగళంతో ముగించడాన్ని గమనిస్తాం..

"స్వాగతం వారి నరవ్యా ఘౌ
దిష్ట్యా పశ్చామి చాపహమ్
దిష్ట్యా చేమౌ నికృత్తామే
యువాభ్యాం బాహుబంధనౌ" (అరణ్య కాండ 70-17)

'సత్వం రామో సి భద్రంతే
హనువ్యేన రాఘవ" (అరణ్య కాండ-71-18)

పై వాక్యాల ఆధారంగా భూమయ్యగారు
'స్వాగతమయ్య రఘురామ! స్వాగతమ్ము
స్వాగతము నీకు లక్ష్మణా! స్వాగతమ్ము
ఈ మహారణ్య భూమికి, ఈ కబంధు
వాసమునకు క్షత్రియులారా
స్వాగతమ్ము!" అంటూ కావ్యాన్ని స్వాగత వచనములతో ప్రారంభించారు.

'అలాగే మంగళము పుండరీకాక్ష మంగళమ్ము
మంగళము దీనవత్సలా! మంగళమ్ము
మంగళము రామా! మంగళమ్ము
మంగళము రామా! రఘు రామా! మంగళమ్ము
మంగళము దయానిధి! సర్వ మంగళమ్ము" అంటూ ముగించారు.

ఇలా కబంధుని శాప విమోచన విశేషా లతో రూపుదిద్దుకున్న లఘు కావ్యమిది!

'శ్రీరామ దర్శనం'- 'మునిశాపం'- 'బ్రహ్మవరం'- 'వజ్రఘాతం'- పరితాపం'-' నామజపం'-'రామానుగ్రహం'- 'నిజరూపం'- 'కబంధహస్తం'- 'సుగ్రీవ మార్గం'- 'కబంధ మోక్షం' వంటి శీర్షికలు పెట్టి కబంధుని వృత్తాంతాన్ని పద్యాల రూపంలో అందించిన ఆచార్య అనుమాండ్ల భూమయ్య గారికి శుభాకాంక్షలు తెలియజేద్దాం.

ప్రతులకు: మనస్విని దేవి
ఫ్లాట్ నెం. 401,
సాయి రాఘవేంద్ర రెసిడెన్సీ
స్వరూప్‌నగర్, రోడ్ నెం.5,
ఉప్పల్, హైదరాబాద్-39
సెల్: 8897073999

- దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

డా॥ సముద్రాల శ్రీదేవి 'శ్రీదేవి శతకం'

డా॥సముద్రాల శ్రీదేవి, 'శ్రీదేవీ!' మకుటంతో కంద పద్య శతకం రచించారు. పండితుల మెప్పు కోసం, పాండిత్య ప్రదర్శన కోసం ఈ శతకాన్ని రచించలేదని, జగన్మాత దీవెనల సన్నిధి, మహత్తర ఫలం కోరి శతకాన్ని రచించానని కవయిత్రి పేర్కొన్నారు. అమలమగు భక్తి తత్పరత, చిత్త శాంతి కలిగించే దీవెనలు, అమ్మవారిని దర్శింపచేసే శక్తి, నిరంతర కరుణా కటాక్షం, స్త్రీశక్తి ప్రదాత్రిగా ఆరాధనతో ఈ శతకం సామాజిక భక్తి శతకంగా మహాలక్ష్మీ వైభవాన్ని కన్నులకు కట్టిస్తుంది. స్తుతి, ప్రార్థన. నివేదన, అభ్యర్థన, ఆవేదన ప్రతిబింబింప చేస్తూ ఈ పద్యాలలో కవయిత్రి జగన్మాత నామాలు,లీలలు, గుణాలు, తత్వ విశేష వివేచనాంశాలను అందించారు.

"అష్టవిధ రూపములతో
అష్టైశ్వర్యముల నిచ్చు హారిణి మాసం
తుష్టివి పుష్టివి నీవని
అష్టోత్తర శతక పద్యమాయె శ్రీదేవీ'

మహమ్మారి కరోనాను గురించి ప్రస్తావిస్తూ

"కాలము మారె వివిధరో
గాలనుగొని తెచ్చె భువి కకావికలాయెన్
ఏలగ జూచె కరోనా



చాలించుము దాని బాధ సరి శ్రీదేవీ!" అంటారు.

తల్లిదండ్రుల ఆధ్యాత్మిక, పండిత పుత్రికగా ఉగ్గుపాలతో రంగరించిన తెలుగు నుడికారాన్ని సింగారించుకొని డా॥సముద్రాల శ్రీదేవి ఈ శతకపద్యాలలో

"వాసవ సహిత సురాళికి
వాసములై సౌఖ్యములను వర్ధిల్లంగా
జేసెదవు ఎల్లకాలము
నీ సన్నిధి గోరి కొలుతు నిను శ్రీదేవీ!" అంటూ సర్వ మానవాళికి సుఖ సంతో షాలు, చింతలు లేని జీవితం ప్రసాదించ వలసినదిగా జగన్మాతను అభ్యర్థిస్తారు.

పతులకు: డా॥సముద్రాల శ్రీదేవి
వై/ఆఫ్. సుధీర్‌కుమార్‌ఫ్లాట్ నెం. 102,
ఇ.నెం. 4-84/1,
విజయ్‌నివాస్ అపార్టుమెంట్
దుర్గానగర్, దిల్‌సుఖ్‌నగర్, రంగారెడ్డి జిల్లా,
హైదరాబాద్-500060
సెల్: 9949837743

-జయసూర్య
సెల్: 90149 48336
9440664610

రంజాన్ నెలవంక వన్నెలు

లేత చిగుర్ల నవ వసంత వేళలు
శత కోటి ఆశల పుష్ప వికాసాలు
రమదాన్ సప్తవర్ణ జీవన సింగిడిలు
వరాల వెండి జల్లులు కుమ్మరించే..
నిర్మల నీలాకాశంలో శశి లీలలు..
మెరుపుల నెలవంక జిలుగులు !

సజ్జనులను సత్కార్యాల దిశకు..
పాపాత్ములను సైతం అల్లాహ్ వైపు..
మరల్చే రంజాన్ శుభప్రద ప్రార్థనలు
ఉషోదయ పూర్వమే 'సహారీ' భోజనాలు
'అల్లాహ్' కరుణాకటాక్షాలకే కాదు
ఆత్మ ప్రక్షాళనక్కూడా ప్రత్యేక ప్రార్థనలు !

నిండైన మనసుతో మానవీయ సంకల్పాలు
దివ్య ఖురాన్ ఆత్మానంద పారాయణాలు
సూర్యాస్తమయం వరకు ఉపవాస దీక్షలు
రవి అస్తమయంతో ఇఫ్తార్ విందుల జోరులు
స్వర్గ 'రయ్యాన్' ద్వార ప్రవేశ అనుమతులు
రమదాన్ 'తరావీహ్', 'జమాత్' నమాజులు !

అమర్, అక్బర్, ఆంథోనీ త్రిమూర్తులు
భారతమాత కంఠాన మణిపూసలు
విశ్వసనీయతకే నిలువెత్తు రూపాలు
సకల క్షేమాలే జాతి శాంతి నెలవులు
రంజాన్, దీపావళి, క్రిస్మస్ వేడుకలు
భిన్నత్వంలో ఏకత్వ సుమధుర సాధనలు !

-డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

మొక్కలు

మొక్కలే కదాయని చులకనగా చూడకు
కష్టాలు రాకుండ చేయును మనకు
ఇష్టముతో ఇంటా బయటా మొక్కలు నాటుదాం
మహిని పచ్చగా ఉంచుకుందాం
మొక్కలే మన మొక్కులు తీర్చే దేవుళ్లు
మొక్కలు మనుషుల భాగ్యవిధాతలు
మనుషుల సిరిసంపదల చిరునామాలు
భూమి వేడిని తగ్గించే దేవతలు
వాతావరణ సమతుల్యతను కాపాడే రక్షకులు
ప్రాణవాయువును మనుషులకు ఇచ్చి
చెడు వాయువును పీల్చుకొనేడి మానవ స్నేహితులు
చల్లని, చక్కని గాలిని నీడను ఇచ్చును
మనుషులకు ,పక్షులకు నివాసంగా ఉండును.
త్యాగమున తరువుకు మించింది ధరన లేదు.

-శీలం విష్ణుప్రియ
6 వ తరగతి

నీటి బొట్టు

ఓ సోదరీ సోదరులారా భరతమాత పుత్రులారా
ఆలకించండోయి నాది ఒక విన్నపం
నీరంటే జీవము,నీరంటే ప్రాణం
నీరు లేనిదే జీవము లేదు మన ఉనికే లేదు
సమస్త ప్రాణుల మనుగడకు ఆధారం
ప్రతి నీటిబొట్టు విలువైనదని తెలుసుకో
గుర్తెరిగి జాగ్రత్తగా నీటిని వాడుకో
ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టు
రేపటి తరాలకు నీటిని దాచిపెట్టు
వ్యర్థమైన నీరు మొక్కలకు మళ్లించు
భూమి లోపల నీటి మట్టం పెంచు
వృధా జలమును ఇంకుడు గుంతలకు మళ్లించు

-భవాని
6వ తరగతి

'పాప' భయం

తల్లి కడుపులోన తల్లడిల్లుతు తిరిగి
ఉమ్మనీరు మింగి ఊపిరి బిగపట్టి
లోకమంటే తను తిరిగినంతేనని
కుట్రలు, కుతంత్రాలు
మాయామర్మాలు లేవని
ధనం ముసుగులో అరాచకాలు
తేనెపూసిన కత్తులు
ఇవేమి తెలియని ఆడపిల్ల
పుడమి మీది కాస్తుందీ
పురుడుపోసుకుంటుందీ
శిశువుగా, శిరీష కుసుమంలా
మాయను ఛేదించుకొని
అందరూ మనుష్యులే అనుకొని
ఆడపిల్ల అంటే లక్ష్మి స్వరూపమని
తల్లిదండ్రులు గారాబంగా
ఎదకు హత్తుకున్నారు
బిడ్డకు మూడు సంవత్సరాలు నిండేసరికి
తల్లిదండ్రులకు ముద్దనోటికి పోవట్లేదు
పేపర్ టివి.వార్తలతో
పసిమొగ్గలపై దారుణం అని చదవగానే
గుండెల్లో అలజడి అవయవాల కంపరం
మానవ మృగాలు ఎక్కడ
పొంచిఉన్నాయో అని
తల్లికడుపునుండి బయటకు వచ్చి
సంతోషం అంతా
ఈ లోకమేనని భావించాలి
కాని 'హుడ్ హుడ్ తుపానులా
వణికిపోవాల్సి వస్తుంది
ఇంటా బయటా బడికెళితే లేదు భద్రం
వయసుకాని వావి వరసలు కాని లేవు
పసిపాలపై పాశవికానికి ముందు
ఆ పాపాత్ములు స్త్రీకే జన్మించామనుకోవాలి
మామూలు భోజనం చేస్తే
మానవత్వం ఉంటుంది
అక్షరాలు నేర్చుకొమ్మని ఆడపిల్లకయినా
చదువురావాలని
రెక్కలు ముక్కలు చేసుకొని అయినా
బడికి తోలుదామంటె
అన్ని వయసుల వారికి
అన్ని వృత్తుల వారికి
క్రూరమైన కళ్ళలో పాశవిక పైత్యరసం
క్రూరసర్పాల బుసలు
క్రూరజంతువుల పశుబలం ముందు
అబలలు లేడికూనలై అలమటించే రోజులు
ఇంట్లో ఉంటే ప్రక్కవాళ్ళు షాపువాళ్ళు
వరసతాతలు, బంధువులు, ఆటోవాలాలు
ఎవరని న్యాయదేవతకు విన్నవించాలి?
ఇదేమిటని ఏ ధర్మదేవతను ప్రశ్నించాలి?
ఆడపిల్ల జన్మించుటే నేరమైతే
అమ్మలేనిది మీరు లేరు
అక్క చెల్లి ఎవరు లేరు
ప్రేమపడే అక్క గారాలచెల్లి
స్త్రీ లేకుంటే సృష్టిలేదని
కామాంధులకు తెల్వదు
కామెర్లరోగికి లోకమంతా పచ్చన
కామపు పొరలు కప్పిన పురుషులకు
లోకమం

కవితా ప్రియుల గుండెలను పరవశింపచేసే 'చిత్తలూరు' కవితలు

పుస్తక సమీక్ష



కవి, కథా రచయిత, విమర్శకులు సృజనశీలి చిత్తలూరి సత్యనారాయణ లఘు కవిత్వం **'వెలుతురు మొలకలు'**, చిన్న పదాలలో హృదయాలను స్పందింపచేసే, భావ కవితా గాంభీర్యతను ప్రసరింపచేస్తు న్నాయి. 236 లఘుకవితలు, మొలకలెత్తిన ఈ సంపుటిలో "చీకటి సముద్రాల్లో ఈదుతున్న వారికి వెలుగు దారినిచ్చే మిణుగురు దీవులు"గా చిత్తలూరీలు, రెక్కలు విప్పుకొన్నాయి. ఈ కవిత్వపు పంక్తులలో జీవం తొణికిసలాడుతోంది. పేలవమైన నాలుగైదు వాక్యాలు అడ్డంగా పేర్చి తాము గొప్ప కవులమని భుజకీర్తులు తగిలించుకొని బిరుదులు, సన్మాన సత్కారాల హోరులో కొట్టుకుపోయే పుంఖాను పుంఖంగా కవులు పుట్టుకొస్తున్న వేళలో చిత్తలూరి కవితలు మోడువారిన చెట్టుపై పిట్టలు, దిగుడు బావిలో మంచినీటి చుక్కలు, పగిలిన అద్దం ముక్కలు తిరిగి అతికించే వేదన, తపన కవితా రూపంగా ప్రతిధ్వనింపచేసారు.

పొలంగట్ల
పియానోమెట్ల మీద
బురద కాళ్లతో నర్తించే
రైతు జీవన సంగీతం ప్రస్తాదించినా

ప్రేమ పుష్పాలు
రాలిపోతున్నాయి
కులమతాల
పాడుగాలి వీచి అనిహెచ్చరించినా

కొమ్మ
గాలికి ఊగుతుంటే
గూడుకాదు
చెట్టు కలవరపడుతోంది" అంటూ తల్లి మనసు వ్యక్తీకరించినా చీకటి చరిత్రలకు వెన్నెలపట్టి, వెలుగులో నిలబెడుతుందని రాత్రిని ప్రేమించే చిత్తలూరి కవిత్వాన్ని ఒడిసిపట్టి, కాగితపు రెక్కలు నిర్మించి, కవితా ప్రియుల గుండె కొమ్మలపై ఎగరేసిన కవ యిత్రి శ్రీమతి అయినంపూడి శ్రీలక్ష్మిగారిని కూడా అభినందించవలసినదే..

ప్రతులకు:
చిత్తలూరి సత్యనారాయణ
డి. రేపాక
అడ్డగూడూరు మండలం
యాదాద్రి భువనగిరి జిల్లా-508 277

-జయసూర్య
సెల్: 90149 48336/ 9440664610

నరహంతక నియంత

నెత్తుటి కిరీటధారి అకృత్యాలు
నరహంతక నియంత నీచాతినీచాలు
రష్యా పురైకు పట్టిన గలీజు బూజులు
పుతిన్ ప్రేరేపిత రక్త పిశాచగణాలు
స్వదేశీ వ్యతిరేక గళాల్ని సహితం?
కోసిన గత ఘనమైన చరితలు
మాస్కో నరమేధ మారణహోమాలు !

ఉన్మత్త పోరులో ఉక్రెనియన్ల రోదనలు
'కీవ్'పై భల్లూకం పట్టు బిగింపులు
అమాయక జనుల తలల్లో తూటాలు
జనం కన్నీళ్ల సునామీలు..
నెత్తురు ప్రవహిస్తున్న నేలలు..
కాలి బుగ్గిగా మారుతున్న మృతదేహాలు !

బిడ్డల ముందే తల్లులపై దాష్టికాలు
పాలబుగ్గలపై పశువాంఛల దాడులు
అబలలపై అశ్లీల అనైతిక దాడులు
దయ దరిచేరని దమనకాండలు
మృతదేహాల గుట్టలపై?
తుపాకుల పైశాచిక నృత్యాలు !

వలసల నిస్సహాయ వరదలు
బాధల్లో అభాగ్యుల అష్టకష్టాలు
బిక్కచచ్చిన దుర్భర బతుకులు
ఒంటరి పక్షులైన పసికూనలు
బిడ్డల ఒంటిపై చిరు'నామా'ల రాతలు
మానవీయతకే మరణశాసనాలు !

అగ్రరాజ్యాల ఒత్తిళ్లలో చిక్కి..
ఛిద్రమవుతున్న చిన్న దేశాలు
భద్రత ఇవ్వని అభద్ర ఐరాసలు
ప్రపంచ ఆర్థికానికి అనారోగ్యాలు
మానవ జాతికే కళంకాల మరకలు !

చర్చల దారులు బారుగా తెరిచి..
నయాన్నో భయాన్నో ఒప్పించి..
'వీటో' పవర్లకు విడాకులిచ్చి?
రాక్షసావతారాల్ని మందలించి?
కొరడాతో బాంబులకు బుద్ధి చెప్పి..
మానవీయ మంటలపై నీళ్లు చల్లి..
ఉక్రెయిన్‌కు ప్రాణవాయువందించి..
ప్రపంచ శాంతిని ప్రతిష్టిద్దాం !

-మధుపాళీ
9949700037

సలాపం

ఎవరో అడిగారు
వయస్సు మరి జీవితానికి
వ్యత్యాసం ఏమని
చాల అందమైన జవాబు.

కాలంతోపాటు
పరుగు తీసేదే వయస్సు
తననీడ వెలుగుల వెంటనడిచేది
జీవితం

హితోపదేశం
అది సత్యం శివం సుందరం
మనం దాన్ని మనసు పెట్టి వినం
మరి
పొగడ్త ఒక మోస పూరితం
మనం దాన్ని ఎల్లప్పుడు
మనసు పెట్టి వింటాం

-రేడియమ్
9291527757

స్వాంతన

ఎందుకో...!
మస్థిక హృదయాలు
సంఘర్షణ పడుతున్నాయి
ఆలోచించాల్సిన మెదడుకు
ఆనందంగా ఉండాల్సిన హృదయానికి
పొత్తు కుదరడం లేదు..

ఈ రెంటి మధ్యలో...
కళ్ళు అలిసిపోతున్నాయి
ఏదో జరుగుతుంది అంతర్లీనంగా..

వీటికి ఓదార్పు కావాలి
కానీ.. ఎలా..?

అవకాశం దొరికిందని
నరాల్లోని రక్తం తన వేగాన్ని పెంచింది-
నా తప్పేంలేదు.
ఆలోచనలో తేడా వల్ల
నేను రాయిగా మారుతున్నానంటుంది
గుండె-

పరిస్థితులవల్ల
ఆలోచించకుండా ఉండలేనంటుంది
మెదడు-

అయినా ఈ రెండూ ఓదార్చుకొని
అర్థం లేని ఆలోచనలకు స్వస్తి పలకాలని-

స్వాంతన పొందేందుకు
మంచి పుస్తకాన్ని చదవాలని
లేదా..
మంచి మిత్రున్ని కలవాలని..

-మాధవ్ గుర్రాల
94926 48887

ఆత్మీయత అనురాగం

దూరపు కొండలు నునుపు అన్న చందం.
దూరం దూరంగా ఉంటేనే
మనుషుల మధ్య ప్రేమలు,
అనురాగ ఆత్మీయతలు..
దగ్గరగా ఉండ వలసి వస్తే
మాత్రం ఈర్ష్యా ద్వేషాలు..!

దూరం దూరం ఉంటేనే కొండంత ప్రేమలు
దగ్గరికొస్తే మాత్రం అసూయ అసహనాలు.!

దూరంలో ఉంటే తొండల్లా తలూపుతారు..
దగ్గరలో చేరువయితే ఊసరవెల్లిలా మారుతారు!

మబ్బుల్లో మెరుపుల్లా సముద్రంలో కెరటాల్లా
ఈ ఆత్మీయతానురాగాలు
క్షణ బంగురాలు
రంగుల బొంగరాలు!

అంతా మాయా జాలం
ఆత్మీయ అనురాగాలకు చెల్లిందీ కాలం.!
ఈర్ష్యా ద్వేషాల నడుమ
అసూయ అసహనాలతో
వెళ్ళదీస్తుంది ఈ లోకం.!!

-ఎన్.. రాజేష్
9849335757

పదునెక్కిన కర్రు

దుక్కి దున్ని మాను తోలి
అడుసంతట ఆకు తొక్కి
నారు పోసి పైరు పెట్టి
అరువుదెచ్చి ఎరువులేసి
మందు చల్లి చీడ చంపి
ఆరుగాలం చెమటోడ్చి
ఆలుబిడ్డలు కడుపు కట్టుకుని
బీడు భూమిన బంగరు పండించి
అందరి ఆకలి దప్పులు తీర్చి
ఇంటి నిండ చీకటుండ
లోకమంత వెలుగు నింపి
కర్రు మొన మీద
భూమండలాన్ని మోసే రైతు
గిట్టుబాటు ధర రాకుండా
దళారుల దగా దోపిడీకి
బండ బారిన గుండెతో
చతికిల పడిపోతున్నాడు.

ఒక్కసారి రైతన్న
మండే సూర్యుడిలా
పదునెక్కిన కర్రులా
ఎర్ర పిడికిలై గర్జిస్తే
విరుగుతాయి
దళారుల వెన్నుముకలు
తెగుతాయి
నల్ల చట్టాల సంకెళ్ళు

-పేరూరు బాలసుబ్రమణ్యం
సెల్: 9849224162

యుద్ధమంటే

అహంకారానికి,
ఆత్మ గౌరవానికి నడుమ
ఓ యుద్ధం జరుగుతోంది,
ఆధిపత్యానికో,
అది ఏ పైత్యానికో,
అర్థం కాని లోకం
ఆద్యంతం చోద్యంగా వీక్షిస్తోంది,
గగన తలాన మృత్యు లోహ విహం'
'గద్దలు" ఎగరడం చూసి,
బంకర్లో దాగిన ఓ తల్లికోడి,
పిల్లలతో సహా
బిక్కుబిక్కుమంటూ కాలాన్ని
పొడుచుకు తింటోంది,

వేల తూటాలు పేలి,
వందల శవాలు రాలి...
నేడో, రేపో యుద్ధమైతే ముగుస్తుంది....
కానీ ఆ తర్వాత....??

రుధిరమంటిన రహదారులు,
పతనమైన పాత గోడలు,
శిథిలమైన నగరాలు,
నలుదిక్కులా ఆర్తనాదాలు,
నిజం చెప్పు....
ఇదే కదా యుద్ధమంటే....?!

స్మశానాల ఆకలి తీర్చడానికి
అమాయకులను
బలివ్వడమే కదా యుద్ధమంటే....?!

రెపరెపలాడే శ్వేత పతాకానికై,
రెక్కలు విప్పే శాంతి కపోతానికై,
వేచి చూసి, అలసి సొమ్మసిల్లిన
ఓ ముసలి కళ్ళ అంచుల్లో
ఎప్పుడో చిక్కుకున్న
ఓ అశ్రు బిందువు నేలరాలుతుంది....

యుద్ధమంటే సరదా పడి,
చివరికి ఏమీ సాధించలేక
రక్తమంటిన రిక్త హస్తాలతో,
తెగిపడ్డ తలలు, చలనం లేని దేహాల సాక్షిగా
కరచాలనం చేస్తూ....
"రణ"రంగస్థలపు నాటకాన్ని
రక్తి కట్టిస్తారు చివరికి "ఆ ఇద్దరు...."

- జాబేర్.పాషా
0096878531638

మానవ..నీవు మారవా.?

నిస్వార్థాన్ని వొదిలేసి
స్వార్థాన్ని పులుముకొని
పాకులాడుతుండే
పేరు ప్రఖ్యాతలకై..!
తండ్లాడుతుండే
తమ గుర్తింపు కొరకై..!!

మంచి తనాన్ని
మట్టు బెట్టి
చెడు గుణాన్ని
తనువున నింపుకొని
చెలరేగుతూ వుండే..!
చెంచాగిరి చేస్తుండే..!!

సాయమన్నది మరిచి
మానవత్వం విడిచి
స్వప్రయోజనాలు తలిచి
తొత్తులుగా మారుతుండే..!
చావలేక బతుకలేక
బతుకు వెళ్లదీస్తుండే..!!

మనుషులమైన మనము
గొర్రెల్లాగ మారుతుంటిమి
చెప్పింది వింటుంటిమి
తలాడించుకుంటు బతుకుతుంటిమి
స్వంతాలోచన చేయకుంటిమి
జ్ఞానాన్ని మరుస్తుంటిమి
అజ్ఞానమున చిక్కుకుంటిమి
అవిటివాళ్ళలా మారుతుంటిమి

మానవా..!.. ఓ మానవా..!!
ఇకనైనా మారవా
నీ బుద్ధి మార్చుకోవా
నీ జ్ఞానాన్ని గుర్తించలేవా
అవిటితనాన్ని వీడలేవా
స్వార్థాన్ని సమాధి చేయలేవా
నిస్వార్థపు జీవనం గడపలేవా
తోటివారికి చేయందించలేవా

తలుచుకుంటే మారగలవు
తలరాతలు మార్చగలవు
మార్చుకో నీ బుద్ధి..మార్చుకో..!
మనిషివన్నది గుర్తుంచుకో..!!

-పసుల.శంకర్
(9542181301

పురుడు పోసుకున్న పున్నమి వెన్నెల....

చిరునవ్వులు
చితికిపోయి
చిమ్మచీకట్లు కమ్ముకొని
బ్రతుకులు చితికిచేరేవేళ
అంధకారబందురమైన మదిలో
ఆనందపు మిణుగురులు
మిలమిల మెరిసే వేళ
అనురాగాల మేఘాలు
రాగాలు తీసేవేళ
చేదు జ్ఞాపకాల
హోరుగాలులు వీచేవేళ
శ్వాస ఆశలనే
అక్షరాలుగా చేసుకొని
కన్నీటి ధారలనే
సిరాచుక్కలుగా మార్చుకొని
కళ్ళతెళ్ళ కాగితాలమీద
మనసొక్కటే మౌనంగా
గతంలోని గాయాలను
గ్రంథస్థం చేస్తోంది
గుండె గర్భగుడిలో
దాగివున్న ప్రేమదేవతకు
ప్రణమిల్లుతోంది
పాలచుక్కలతో
పరిమళించే
పూల రెక్కలతో
పూజ చేయ
పున్నమి వెన్నెల
పురుడు పోసుకున్నది
కొత్తగా ఆశ రెక్కలు తొడుక్కున్నది
కొత్తగా శ్వాస మొక్కై మొలుస్తున్నది

-పోలయ్య కవి కూకట్లపల్లి
9110784502

కలలు కంటున్న భవిష్యవాది

పుస్తక సమీక్ష

ఆధునిక తెలంగాణ కవితకు వందేళ్ళు నిండాయి. సురవరం ప్రతాపరెడ్డిగారి 'మాతృభూమి' కవితతో ప్రారంభం అయిన ఈ ప్రక్రియ వందేళ్ళ ప్రస్థానంలో ఎన్నో క్రొత్త మలుపులు తిరిగాయి. పరాయిపాలన, విమోచన, తెలంగాణా సాయుధ పోరాటం, స్వాతంత్ర్యం, నిజాము పాలన నుండి విడిపడటం, పెద్ద మనుషుల ఒప్పందం అన్నదమ్ముల మధ్య అన్యాయం రగిలిన చిచ్చు, నక్సలిజం, అన్నదమ్ములు విడివడటానికి జరిపిన పోరాటం (వేరు తెలంగాణ ఉద్యమ పోరాటం) 90వ దశకంలో ప్రపంచీకరణకు వ్యతిరేకత, వీటన్నింటికి తోడు సమాజంలోని అసమానతలు, వర్ణ, వర్గ వివక్షత, వెరసి నిత్యగాయాల బ్రతుకు అయింది. 1969లో మొదలైన ప్రత్యేక/ వేరు తెలంగాణ ఉద్యమం 90 దశకంలో ఊపందుకుని 2014 వరకు కొనసాగింది.

'ఇక తీరం చేరినట్లే' అని అందరూ విశ్వసించే వేళ ముందు చూపు మెండుగా ఉన్న రచయిత డా॥ కాంచనపల్లి గోవర్ధనరాజు (కాంచనపల్లి) **"కల ఇంకా మిగిలే ఉంది"** అంటున్నారు. 1994లో **'ఆచూకి'** కవితా సంకలనం వెలువరించి అదే యేడు **'చేదబావి'** కవితా సంపుటికి అదించిన వీరు సృజనశీలిగా ఉద్యమశీలిగా అనేక ప్రత్యేకతలున్న ప్రతిభాశాలి 1998లోనే **'ఇంకా యుద్ధం మొదలు కాలేదు'** అని హెచ్చరించిన కవి, కథ, కవిత్వం, వ్యాసంలాంటి పలు ప్రక్రియల్లో తనదైన ముద్రవేసుకున్న వీరు కవితపై ప్రత్యేకాను రక్తిని పాఠకులు గమనిస్తారు. విద్యార్థి దశనుండే నలుగురిని కూడగట్టుకుని Motivate చేస్తూ తన వెంట తీసుకుపోగలిగే ఔత్సాహికులు ఈ క్రమంలోనే వీరు **'ఆచూకీ', 'తండ్లాట', 'ముసుం' సంకలనాల్ని,** ఏనుగు నరసింహారెడ్డి, బాణాల శ్రీనివాసరావు, సాయిడి జగన్‌రెడ్డి, అజీమ్ లాంటి ప్రముఖులతో సహ సంపాదకత్వం వహించారు.

వీరి కవితలన్నీ, పద పటాటోపం లేకుండా, అతి సామాన్యమైన వాడుక భాషలో ప్రకంపనలు సృష్టిస్తాయి.

ప్రముఖ కవి సాయిడి జగన్‌రెడ్డి ఈ సంపుటికి తన ముందు మాటలో చెప్పినట్లు "ఆనాటి సాహిత్య ఉద్యమాలను ఎడంగా ఉంటూనే అందులోని ప్రగతిశీల భావనలు స్వీకరిస్తూ, వాటిపట్ల కవిగా ప్రతిస్పందించిన వారు" అంటూనే ఇవి (కవితలు) నవ తెలంగాణలో నూతన సాహిత్య సంస్కృతి నిర్మించటానికి దోహదం చేస్తాయని" కితాబిచ్చారు.

'ఇంకా యుద్ధం మొదలు కాలేదు', వినూత్న దృశ్యం కోసం సుదీర్ఘ స్వప్న నది ఒక గ్రహణం పట్టిన రోజు, ఓ వాన కురిసిన రాత్రి, ఈ కల చెదిరిపోదు, వీరుడా నీకెలా నమస్కరించను? కల ఇంకా మిగిలే ఉంది లాంటి శీర్షికలు మొదలు పెట్టగానే పాఠకుడిలో కుతూహలం రేకెత్తిస్తారు. ఎక్కడా సాగెదీతలు లేకుండా నేరుగా చెప్పదలచుకున్న విషయాన్ని ప్రసాదిస్తారు. **"శబ్దం పూయటానికి నిశ్శబ్దంతీగ/ ఉబలాట పడుతున్నది/ ఇక ఒక్కసారిగా తెర తేవాల్సి ఉంది"** అని, **"ఎవరో అకస్మాత్తుగా ఆకాశం మీద/ ఎర్ర నీళ్ళు చల్లారు", తూరుపు స్తంభం/ కొసకొమ్మల్లో ఒక నెత్తురు జండాను మొలిపిస్తారు.** (ఇంకా యుద్ధం మొదలు కాలేదు). తనలోని అంతః దృశ్యాలను 'కిటికీ కెమెరా నుండి ప్రసరింప చేస్తారు.

మరో చరణంలో **'కిటికీ అలా అలవోకగా తెరుచుకుంటే/ అలా అలా/ ఒక దేహంలో ప్రాణం పుప్పొంచడమే'** (కిటికీ) అంటూ బాహ్య ప్రపంచానికి 'కనెక్టు' అయిపోతారు. అమ్మతో తన అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, **అమ్మ తనలో ఎంత అమరంగా నిల్చిందో.. అమ్మ మరణిం చలేదు/ అమ్మ ముందు మరణమే మరణించింది"** అంటారు ఒక కవితలో.

మధ్య తరగతి బ్రతుకులు చిత్రించటంలో వీరికి వీరే సాటి అనిపిస్తుంది. ఈ తరగతి క్రిందికి దిగజారలేరు. పై తరగతి జీవితాల్ని అందుకోవాలని అనుక్షణం ప్రయత్నిస్తూ ఉంటారు.

ట్యూషన్ అంటే క్లాసు తెచ్చుకోవటం అనుకుంటుంది ఆ చిట్టితల్లి. కాని మాస్టారు అజ్ఞాత వాంఛలు, ప్రతిఫలించే మాటల సూదుల్ని "మర్యాదగా' గుచ్చుతూ వయసు పొంగులవేపు దొంగ చూపుల చురకలు వేస్తే తల్లడిల్లిన ఆ చిట్టితల్లి కోడిపిల్లలాంటి తనను మాస్టారు పాము ముందుకు పంపవద్దు.. "తండ్రీ!" అంటుంది. చిట్టితల్లి ఆవేదన, భగ్నమవుతున్న స్వప్నాలను- బహుశా ఇంతకంటే గొప్పగా మరొకరు చెప్పలేరేమోననిపిస్తుంది (నాన్నా, నాకు ట్యూషనొద్దు).

బాల్యంలో అందునా కన్నె వయసులో బతకమ్మ పండగ చెరగని ముద్రవేసే పండగ. జీవితాంతమూ తలచి మురిసే పండుగ. **'బాల్యం తీగకు పూసిన గుమ్మడి పూవా!'** అంటూ నడివయసు నగర వాసి గుర్తుకు తెచ్చుకుంటూ, 'మాలో మళ్ళీ బతుకు బతకమ్మా' అంటూ వేదన చెందటం (బతుకమ్మ) తెలంగాణ మధ్యతరగతి జీవితమే. ఈ వచన కవితలో రూపుదిద్దుకుందని పిస్తుంది.

'చూపు నూది నిరాటంకంగా/ చిగురించిన యవ్వనం మీద/' గుచ్చుటం' యాదృచ్ఛికమే కావచ్చు. కాని కంటి వెనక శూన్యపు బావులు దాచుకున్న, ఆ విద్యార్థినిని తల్లి అంటు సంబోధించి పరితప్తుడిని చేస్తారు రచయిత (అలా అనుండాల్సింది కాదు..)

వేరు తెలంగాణ ఏర్పడగానే సంబరాలు చేసుకుంటున్న వారిని **'గద్దలింకా కోడి పిల్లలవేట'** చేస్తున్నాయని 'నీమాంధ్ర పాములు పొంచి చూస్తున్నాయనటం (రేపటి స్వప్నానిది) కవి ముందు చూపుకి గొప్ప ఉదాహరణ. నేటిని దాటి రేపటిలోకి చూడగల్గటమే విజ్ఞత.

లంచి బాక్సుని మధ్యాహ్నపుటాకలి అనటం (పే.82) మాతృస్థన్యాన్ని తెల్లతేనెగా చెప్పటం (పే.101) ఛత్రిని నల్లపక్షి (123)గా పేర్కొనటం, కవిలోని భావుకతకు నిదర్శనాలు.

భౌతిక వాస్తవికతను రొమాంటిక్‌గా చెప్పటం కాంచనపల్లి శైలిలోని విశిష్ట గుణం. అవును ఇది నూటికి నూరు పాళ్ళు నిజం! నగరానికి వచ్చినా, పల్లెనిండా పదిలంగా దాచుకున్న మనతో ఇంత అందంగా పంచుకున్న కవి డా॥ కాంచనపల్లికి అభినందనలు.

విప్లవ కవి వ్లాడిమిర్ మయకోవిస్కి (Futurist) కి ఏ మాత్రమూ తీసిపోని నిత్యపోరాట యోధుడు.

ప్రతులకు:
ఎ. అంజనీదేవి, తార్నాక
సికింద్రాబాద్-500 017.
మరియు పాలపిట్ట బుక్స్, మలక్‌పేట, హైదరా బాద్-36.
ఫోన్: 040-27678430)

- కూర చిదంబరం
సెల్: 8639338675

గజల్

మోస్తున్నది నా హృదయం మోయలేని భారమేదొ
రాస్తున్నది ఏ హృదయం రాయలేని భావమేదొ

రస వీణను శృతి చేసి స్వర ఝరిలో వదిలేస్తే
అల్లుకొంది నా ప్రణయం అలుపులేని రాగమేదొ

గుచ్చుకునే ముళ్ళులేక విచ్చుకోదు గులాబైన
సహిస్తుంది నా మౌనం అంతులేని శోకమేదొ

కన్నైనా మిన్నైనా కురిసేనుగ ఎర్రబడితె
విడుస్తోంది నా నయనం ప్రేమలేని స్నేహమేదొ

ఎదురెళ్లవె ఓ సత్యా! ఎదురులేని కాలానికి
చేరమంది నీ గమ్యం చెదిరిపోని స్వప్నమేదొ!!!

-రాజశేఖరుని శ్రీ శివ లక్ష్మి
8790700383

బద్ధకం (కథ)

అనగనగా మహబూబ్ నగర్ అనే పట్టణంలో గోవింద్, పద్మ అనే భార్యాభర్తలు ఉండేవారు. వారిద్దరికీ ఒక కొడుకు ఉండేవాడు. తన పేరు మురళి.అతడి వయస్సు 7 ఏండ్లు. అతడు మంచివాడే కానీ బద్ధకస్తుడు. ఎప్పుడూ ఏ పని చేసేవాడు కాదు. ఎప్పుడు చూసినా తింటూనే ఉండేవాడు. రోజూ అలా తింటూనే ఉండేవాడు. నెల రోజుల తర్వాత మురళి లావుగా ఉన్నట్లు గోవింద్ కు అనిపించి అతని బరువు పరిశీలించారు. 20 కేజీలు పెరిగాడు అని తేలింది. అంతే! 20 కేజీలు ఉన్నవాడు 40 కేజీలు అయ్యాడు. ఆ రోజు బయటి పిల్లలు అందరూ మురళిని ఏడిపించారు. అది చూసి గోవింద్, పద్మలు చాలా బాధపడ్డారు. గోవింద్ కు ఒక ఉపాయం తట్టి ఒక కట్టెలు కొట్టేవాడిని పిలిపించి మురళితో

"బాబు! ఇక్కడికి 20మైళ్ళ దూరంలో ఒక మామిడి చెట్టు ఉంది. రోజూ ఆ చెట్టు దగ్గరకు ఏమీ తినకుండా వెళ్లి నీకు కావాల్సింది అడిగితే 15 రోజుల తర్వాత నువ్వు అడిగినవన్నీ ఇస్తుంది,"అని అతనితో చెప్పించాడు. మురళి ఎంతో సంతోషించి వాళ్ళ తల్లిదండ్రులకు విషయాన్ని చెప్పి బైక్ లో వెళ్దామని అన్నాడు. గోవింద్, పద్మలు కీళ్లనొప్పులు అని నటించారు. ఇక మురళి నిరాశ చెందాడు. కానీ తిండి మీద ఆశతో సైకిల్ మీద అక్కడికి వెళ్తానని బయలుదేరాడు. 14రోజులు గడిచాయి. చివరి రోజు మురళి ఎంతో ఆసక్తితో అక్కడికి బయలుదేరాడు.కొంతసేపు తర్వాత చెట్టును చేరుకుని ఆ చెట్టుకు నాకు ఎప్పుడు ఆకలి వేసినా తినడానికి బోలెడెంత తిండి కావాలి,"అని అడిగాడు. చెట్టు ఇవ్వలేదు. ఇంకొక్కసారి అడిగాడు. చెట్టు ఏమీ ఇవ్వలేదు. మురళి బాధపడి నిరాశతో ఇంటికి వెళ్లి అద్దంలో తనను తాను చూసుకుని ఆశ్చర్యపోయాడు. ఎందుకంటే తను15రోజులు సైకిల్ తొక్కి తొక్కి20 కేజీలు తగ్గి సన్నబడ్డాడు. అప్పుడు అతనికి ఇదంతా గోవింద్ వేసిన పథకం అని అర్థమయింది. ఇక తను బద్ధకం, తిండిబోతు తనం వదిలేసాడు.

-నీతి:బద్ధకస్తుడిలా ఏ పని చేయకుండా రోజంతా
తింటూ కూర్చుంటే ఆరోగ్యానికి, భవిష్యత్తుకు
మంచిది కాదు.

-పలిపే రామ్ చేతన్, 7వ తరగతి
ప్రజ్ఞాన్ ది స్కూల్, ఉప్పల్
9502156813

ఉచితాల తెగులు..

ఏదైనా సరే..
ఆయాచితంగా వచ్చిపడితే
దానికి విలువుండదు.
ఉచితంగా ఒచ్చి ఒళ్ళో
పడేదానికి సముచితస్థానం దొరకదు..
తెలుగు రాష్ట్రాల అభివృద్ధి పంటను
ఉచితాల తెగులు ఆశిస్తోంది
ఒక్కసారి అది ఆశించడం మొదలెడితే
శాసించడం తప్ప వేరేది ఉండదిక..
ఉచితాల తెగులు తగిలి
ఆర్థికవేర్లు బలంగా ఉన్న ఎన్నో దేశాలు
కూకటివేళ్ళతో మట్టికరిస్తే
మరెన్నో రాష్ట్రాలు పట్టిపోయాయి
సమపాళ్లలో శ్రమను,
అంకితభావాన్ని జోడించి పిచికారీ చేస్తే
ఈ తెగులును ఆరంభదశల్లోనే
నివారించొచ్చు..
అత్యవసరమున్నవారికే
ఆర్థికంగా ఐసియూ లో ఉన్నోళ్లకు
ఈ ఉచితాల సెలైన్ ను ఎక్కిస్తే
వారు ఆర్థికంగా ఒడ్డునపడొచ్చు.
కానీ ప్రతి ఒక్కరికి అనుచితంగానే
ఈ ఉచితాల్ని అలవాటు చేస్తే
ప్రభుత్వపొరబాట్లకు దిద్దుబాటులేక
జీవితం గ్రహపాటులో గడిచిపోతుంది..

-సర్వరాజ్ అన్వర్
9440981198

హైటెక్ సరదాలు

పట్టణ., నగరాల శివారు
విలాస విడిది ప్రాంతాల్లో...
రాత్రి పగలు తేడా లేని
పబ్బుల్లో క్లబ్బుల్లో..
ఫ్యాషన్ కల్చరని మురిసే
నాగరికత ముసుగేసుకున్న
నగ్నదేహాలన్నీ కూడి
కొరివి దయ్యాల్లా నర్తిస్తూ..
విశృంఖల విలాసాలు...

కుటుంబ బంధాలు విడిచి..
నైతిక విలువలు మరచి..
ఖరీదైన పార్టీల పేర
విచ్చలవిడి సరదాల్లో...
కొందరు..
పేరు మోసిన పెద్దోళ్ళు
తెరమీద మెరిసే బొమ్మలు..
ఉద్యోగ వ్యాపారస్తులు
ఉన్నత విద్యావంతులు
సంపన్న కుటుంబాల కులాసా జీవులు..

అడ్డు అదుపులేని
అనైతిక సంపాదనతో..
జల్సాలకు తిరిగి మరిగి...
డ్రగ్స్ మత్తులో నిండా మునిగి..
కనులకు ఇంపుగా తోచిన
చెడిన కంపు దేహాలన్నీ..
మాంసపు ముద్దలను పీక్కుతినే
మదమెక్కిన మృగాల్లా..
ఒళ్ళు మరిచి బరితెగించి
కులుకుతున్న జీవాలు...

-రాచర్ల శ్రీనివాస్
9704246125

రైతు

అరక చేతబూని
ఉదయత్పూర్వం
పొలం చేరే కృషీవలుడు.

రాత్రనకా పగలనకా తన
రుధిరాన్ని స్వేదంలా
చిందించే శ్రామికుడు.

దేశ ప్రజల ఆకలి తీర్చే
నిత్యం శ్రమించే జీవుని
ఆకలి తీర్చగా కానరారు పుడమిన

పంటకు గిట్టుబాటు ధర కల్పించుకోలేక
దేశానికి వెన్నెముక అయిన రైతు కడుపు
తాకే వెన్నెముకకు
నేలతల్లి గర్భాన సిరుల పండించు నేర్పరి
మూగజీవుల సాహచర్యం తో
సంతసించు గడసరి
ప్రకృతి ఒడిలో సేదతీరు శ్రమజీవి నేడు
కడుపు నింపుకున లేని నిరుపేద

అన్నదాత సుఖీభవ అని పెద్దల మాట నిజం
చేయ మార్చాలి
రైతు జీవన రేఖ కళ కళ లాడే
రైతు జీవితం జగతికి శోభితమవదా

-సి.హేమలత
9666779103

జ్ఞాన పుటం

ఆకాశమెందుకో ఎర్రబడ్డది...!
సంధ్యా సమయపు
నులి వెచ్చని సిగ్గు వర్ణం కాదది...?

అజ్ఞానం ఆవహించిన
ఓ చదువుల తల్లి
మూఢనమ్మకాల చెద పురుగై
పసిగొంతుకను తెగ్గోయగ
ఎగచిమ్మిన రక్తపు వర్ణమేమో అది...!

ఏనాటి కోపమో
గుండె గదుల్లోన చేరి
సలసల కాగే ప్రతీకారపు లావయై
అదను చూసుకుని
ఒక్కసారిగా విస్ఫోటనమై చేసిన
మారణహోమపు ప్రతిబింబమేమో అది...!
అక్కడా ఇక్కడా అని కాదు
ప్రపంచపు నలు దిక్కులా అదే తంతు...!

ప్రాణాలతో చెలగాటాలు
చిరునామా కోల్పోయిన మానవత్వం!

ఒంటరి చూపు

మునిమాపువేళలో
ఎదురుచూపులే స్నేహితులు
స్తంభిస్తూ కాలం
వెన్ను నిమురుతుంది
మౌనం సాక్షిగా
నీలోకాన్ని వెతుక్కోమంటుంది.

కాలం చెల్లిన మనిషివి నువ్వని
ఎవరన్నారు
ఎత్తుపల్లాల జీవితాన్ని
సాపుచేసి
కుటుంబానికి కానుకచేసిన
బాటసారివి నువ్వు.

కలలను కలతలను సమానంగా
కళ్ళలో వేసుకుని కష్టపడుంటావు
గుర్తిస్తేనేం గుర్తించకపోతేనేం
కుటుంబానికి కుదురువు నువ్వే.

ఒంటరిగా జ్ఞాపకాలతోటలో
విహరించటమే వ్యాపకమిప్పుడు
వేదనలు వేధింపుల వాస్తవాలను
మరచావనుకో
నీ ధ్యానమే
నీకు ఊరట బాసట.

-సి.యస్.రాంబాబు
8374818961

నాలుగు నాళ్ళ ఆతిథ్యాన్ని
స్వీకరించగ వచ్చిన
చిన్ని జీవితాలు మనవని మరిచి

ఒకరినొకరు... ఎవరికి వారు
చంపుకుంటూ ఏమి సాధించాలనో మరి...?

ఈ కాసింత జీవితాన్ని
మనవి కాని ఆలోచనల సుడిగుండంలో
చిక్కుబడి
ద్వేషాగ్ని కీలలమై ఎగిసిపడి
వృథా చేసుకుంటే ఏం లాభం...?

పరోపకార మంచుకొండలమై
నిలవకున్నా పర్వాలేదు
మన కోసం మనం
ఆనందాల సెలయేరులమై
పారితే చాలుకదా

నేర్చుకున్న విద్యకు
విచక్షణా జ్ఞాన పుటం పెడితే
మేలిమి బంగారమై
మెరిసిపోవచ్చు!

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 516వ రోజు 'అపోహ' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'అపోహ' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా...

-సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

ఎనుబోతులపై జడివాన

ఇచ్చక బుచ్చకాలాడినా
ప్రతిఒక్కరికి ప్రీతిదాయకమే
కానీ..
ఓరపారలు దిద్దేందుకు
ఆవగింజలో అర సగమైనా
ఉన్నదున్నట్టు అంటే చాలు
ఆలగోడు బాలగోడునే కదా!.
కండలను కోసిచ్చే వారిని సైతం
తప్పు పడుతూ
కుడియెడవు మరిచి నిందమోపే
మూర్ఖులున్న చోట
తప్పదు కదా ఒకింత బాధ!.
కన్నుమిన్నెరుగక
కయ్యానికి కాలు దువ్వూతూ
లల్లాయి లాలిత్యమెరగని జగంలో
లేనిదున్నట్టు
ఉన్నది లేనట్టు
భ్రమింపజేసే మనసులకు
మంచితనమెంత గుమ్మరించినా
ఎనుబోతులపై జడివాననే..
గాలి మాటలకు కళ్ళెమేసే ప్రయత్నంలో
ఇక కప్పదాట్లు వేస్తాయి
గొర్రెతోక బుద్దులు..
ఏటికెదురీదని అపోహలున్నచోట
కర్ణుడు లేని భారతం కంటబడగా
కడివెడు కంటనీళ్ళకు కొదువరాదు..
అందుకే..
అంగలార్చే వారు అపోహలకు చింతించక
అంతా మనమంచికే అంటూ..
కనుల ముత్యాలు గార్చుకొంటే
ఇక మీకే చెందుతాయి కదా
కోటి ఏటికోళ్లు...
గమనిక:
ఇచ్చక బుచ్చకాలు=ముఖప్రీతి వాక్యాలు
ఓరపారలు=లోపాలు
ఆలగోడు బాలగోడు=పెడబొబ్బలు,ఇతరులతో
కలిసి చేసే రోదనలు
అంగలార్చడం =దుఃఖించడం
కండలు కోసియిచ్చు=కష్టములకోర్చి
పరోపకారం చేయు
కన్నుల ముత్యాలు =ఆనందబాష్పములు
ఏటికోళ్లు=నమస్కారాలు.

-శ్రీలతరమేశ్ గోస్కుల

కలతల మనసు

సీ. కలతల మనసులు కలకాలపోహతో
నిలవని దయ్యెను నెట్టివేస్తు
అర్థము లేకయే యాలోచనలతోని
మునిగిన వాడయ్యి మోదులాగ
నిందలే వేయుచు దీనస్థితినిలిపి
ఆలుమగలపేర్మి యంతకుదయి
పుట్టినోడుభువిన బొందనే తవ్విన
చెట్టునైనతుదకు చీల్చినోడు .

ఆ. నట్టియింట నున్న నాగుబాముల చుట్టి
కాటు వేయు ఘడియ గాంచి నిలిచె
మంచితనము చంపి మానవ మాత్యుడు
నీడనైన కాని నిందలేసి
తే. కండగలదియు గుండెవే కాలనాగు
కన్న విషముగలిగినాడు కంటి రెప్ప
గాదు కడుపులో దాచక గగన దారు
లందు చంపివేసి నవాడు రౌద్రుడయ్యి
ఆ. మనిషి మనసు లేక మందబారుడయెను
చెప్పినోళ్ల మాట చెడ్డ దయిన
విన్నవాడు యయ్యె పిరికితనము తోని
ప్రాణములను విడిచి రాగమందు.

- వి .సంధ్యారాణి

అపార్థాలకు నాంది

అపోహలు అపార్థాలకు నాంది
అనుబంధాలను తొలగిస్తూ
మిత్రులను శత్రువుల చేస్తాయి
అపోహ నిజంకాదు
అది ఎండమావి
నిగ్రహంతో పరిశీలిస్తే
నిజం ఉనికి
తొందర పడవద్దు
అపోహలకు దాసోహం కావొద్దు
అనవసర శత్రుత్వాలకు
ఘన స్వాగతం పలుకొద్దు
బలమైన బంధాలను
బలహీనంగా మార్చొద్దు
నిదానంగా ఆలోచిద్దాం
అపోహలను తొలగించుకుంటూ
మానసిక ఆందోళనకు
దూరంగా ఉందాం
అన్నిరకాల బంధాలను
బలీయం చేసుకుందాం
ఆనందంగా జీవిద్దాం.

-గుండం మోహన్ రెడ్డి

అపోహ

ఆదిన "నే"నపోహ పడ ఆత్మగనే నిహమందు జీవుడై
మైదును గెల్వలేక నిహమందుననే తిరుగాడుచుండ నే
నాదికి మున్ను వేదియని యర్థము భావము తెల్లమైననూ
యేదియు కాని"నే"ను కను టెప్పుడు? నప్పుడపోహపోవునే?

-రుద్రాక్షల మఠం ప్రభులింగశాస్త్రి

రక్త సంబంధం కూడా..
ఒక్క అపోహతో అన్యాయంగా
దూరం చేస్తుంది !.

- ఎం. వి. ఉమాదేవి

చిలికి చిలికి!

అపోహల పోహళింపు
అనర్థాలకి ఘాటైన తాళింపు!
చిర్రుబుర్రులు
చిటపట సిగపట్లగోత్రాలు!
రామరావణయుద్ధం!.

చిన్న అపోహ నిప్పురవ్వ
కుటుంబ సంఘ దేశాలపాలిట
ఖాండవదహనం!
భ్రమ భ్రాంతి అనుమానం
పెనుభూతం గా!

మయసభలో పాంచాలి నవ్వు
కురుక్షేత్ర సంగ్రామం!
పటపటపళ్లు నూరిన
సుయోధనుడు!
వంశనాశనం!.

కొడుకుని ముంగిస
చంపిందనే అపోహతో
ఆతల్లి తీసింది దాని ప్రాణం!
చేతులు కాలాక
ఆకులు పట్టి ఏంలాభం?

అత్త ఆడపడుచు పై
కాండేలుచెప్పే కొత్త కోడలు
ఆలిపై అనుమానం పెంచే
ఇంటి సభ్యులు
ఏటికొకరు కోటికొకరు
ఇల్లు కిష్కింధకాండ!.

వివిధ ఛానళ్ళు చూపే వార్తలు
రోగాల వివరాలు వింటే
లేనివి ఊహించి చించి చించి
ఆలోచించి మనిషి
మారు రోగాల రోబోట్ గా!
గిల్లి కజ్జాలతో బడాయిగా
లడాయి చేసేవారుంటే
గోటితో పోయేది గొడ్డలి దాకా సాగు!.
నేటి సమాజం ప్రపంచం
అపోహలతో అతలాకుతలం!
ఎక్కడిమాటలు అక్కడ విని
గప్ చిప్!
ఇంకొకరిచెవి కొరికితే
సుఖం శాంతి ఫటాఫట!

-ఎ.రాజ్యశ్రీ

వక్రభాష్యాలకు తేలికదారులు

ఒక్క తొందరపాటు
ఒక అపోహ
సంఘటనకు చెందిన
పూర్వాపరాలు ఆలోచించనివ్వక
తండ్రి తెలివిని కబళించింది
పసివాడిని కాపాడిన
ముంగిస ప్రాణాన్ని హరించింది.
ఒక్క చిన్న అపోహ అవ్యాజమైన
కైకేయి అనురాగాన్ని
అసూయగా మార్చి వేసింది,
వరాల రాముణ్ణి
వనాలకు పంపింది.

ఇసుమంత అపోహ
కృష్ణదేవరాయల
హృదయ నేత్రాలను
మబ్బులా కమ్ముకుంది
గురుదేవులు
తిమ్మరుసు కళ్లను
అన్యాయంగా బలిగొన్నది.

ఎవ్వరో అల్లిన అపార్థాలు
అపరమేధావి తుగ్లక్ ను
చరిత్రలో పిచ్చితుగ్లకుగ
ముద్రించి వేశాయి.

అపోహలు
అపార్థాలకు అతి సులభమార్గాలు
వక్రభాష్యాలకు తేలికదారులు.

అపోహ వద్దు

ఊహల్లో తేలితే ఉల్లాసమే
అపోహల్లో ఉంటే ఆపదలే
తప్పు ఆలోచనలు
తప్పు ఊహలు
అపోహలకి నాంది
వక్రీకరించిన సత్యం
ఊహాత్మకం
కల్పిత ఊహ
గాలికంటే వేగంగా వ్యాప్తి
వాటిని నమ్మకూడదు
ఇద్దరిమనుషులా మధ్య
రెండుమనసుల మధ్య
అగాధం సృష్టించేది
కుటుంబాల విచ్ఛిత్తికి
కారణం అపోహలే..
మన విజ్ఞతే
అపోహని విసర్జించే ఆయుధం
జీవితంలో భాగం
వివేచనే వివేకం..

- మోటూరి శాంతకుమారి

అంతా గోవిందం

అపోహ
అపోహ
మనసు చేసే ఒక ఊహ
లాభం లేక
ప్రలోభానికి గురై
చెడు ప్రభావానికి
దారి తీసే ఒక సెగ
సంసారం
కుటుంబ ఐక్యం
స్నేహ శీలం
వ్యాపార నమ్మకం
వ్యవహార సారం
ఒక్క అపోహతో గోవిందం....
ఓ స్త్రీ రేపు రా...
నా చిన్న నాటి భయానక అపోహ...
అపోహలతో
అపవాదులు పడేకన్నా
ఆ ఊహలతో
చిద్రమయ్యే కన్నా
తర్కించి సారించి
ఉండటమే మిన్న.

- జె.నరసింహారావు

భ్రమ

అపోహ
ఒక మానసిక వత్తిడి
సదా ఆలోచించి ఆవేశపడి
వ్యక్తుల ను అనుమానిస్తూ
అశాంతి తెచ్చుకుని ఆవేదనతో
అనారోగ్యాల పాలు
విచిత్రం-
ప్రతి అంశంలోనూ ఒక భ్రమ
అంతా అశాంతి మయం చేస్తూ
జీవితం లో ఎదుగ లేరు.
మనిషి మంచి అలోచన కలిగి
పద్ధతి గా జీవించాలి
అపోహ మనిషి జీవితానికి అడ్డు.

-నారుమంచి వాణీ ప్రభాకరి

ఆత్మీయుల మనోభావాలను
చక్కగ అవగతం చేసుకో నేస్తం
నలుగురికీ తల్లో నాలుకలో
మసలుకో.

-ముద్దు వెంకటలక్ష్మి

కొంప ముంచుతుంది

పొరుగింటి పుల్లగూర రుచిగా
ఉంటుందన్నట్టు
వాస్తవం కంటే అపోహ బలంగా
కొన్నాళ్ళు మనసును ఆక్రమిస్తుంది
పర్యవసానంగా కుటుంబంలో
వ్యక్తి మనసులో అల్లకల్లోలం సృష్టి
కళాకాంతి లేని ముఖాలు
క్రమబద్ధంగా లేని దినచర్యలూ
అసంబద్ధమైన మాటలు చేతలూ
వెరసి అపోహ పెద్దఅనకొండ
నోరు తెరిచి
కుటుంబసంబంధాలను విచ్ఛిన్నం చేస్తుంది
దీనికి విరుగుడు
ఎప్పటికప్పుడూ సమాజపరిశీలన...
పోల్చుకోని తత్వం
ఉన్నదాంతో సంతృప్తి జీవితం !
ఏళ్ళ తరబడి సాగిన

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ్ గ్రహీత డా.పాపినేని శివశంకర్ కు ఒంగోలులో జరిగిన సాహిత్య సభలో ప్రకాశంజిల్లా రచయితల సంఘం పూర్వ అధ్యక్షులు 'భీమనాథం హనుమారెడ్డి స్మారక సాహితీ పురస్కారం 2022' ప్రదానం చేస్తున్న ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు, కార్యదర్శి యత్తపు కొండారెడ్డి, డి.ఈ.ఓ. విజయభాస్కర్, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, ప్రముఖ నాటక రచయిత పాటిబండ్ల ఆనందరావు, సీనియర్ న్యాయవాది నాగిశెట్టి మోహన్ దాస్, రాష్ట్రపతి అవార్డ్ గ్రహీత డా.చుంచు చలమయ్య

ఈ తరం కవితా వేదిక ఆధ్వర్యంలో ఏప్రిల్ 28న తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో షేక్ అహమద్ బాషా కథల సంపుటి "జీవన సంధ్య" ఆవిష్కరణ జరిగింది.వివిధ పత్రికలలో ప్రచురితమైన ఇరవై కథలను కుటుంబ సభ్యులు రచయిత మరణానంతరం కథల సంపుటిగా తీసుకురావడం గమనార్హం.

ఈ సమావేశంలో ఈ తరం కవితా వేదిక అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, ఆచార్య దామోదరం నాయుడు, బాషా సతీమణి బాల సరస్వతి, సాహితీ ప్రియులు ఆకుల మల్లేశ్వరరావు, రచయిత ఆర్సీ కృష్ణ స్వామి రాజు తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు సాహితి అవార్డుకు కవితా సంపుటాల ఆహ్వానం

తెలుగు సాహిత్యంలో ఉత్తమ వచన కవిత్వాన్ని ఆవిష్కరిస్తున్న కవులకు ప్రతి సంవత్సరం పాలమూరు సాహితీ అవార్డులను ప్రదానం చేస్తున్న సంగతి సాహితీవేత్తలందరికి తెలిసిందే. గతంలో ఈ అవార్డులను ప్రముఖ కవులు డా. రాధేయ, డా. కాసుల లింగారెడ్డి, డా. పెన్నా శివరామకృష్ణ, కందుకూరి శ్రీరాములు, అంబటి నారాయణ, ఎస్.హరగోపాల్, కోట్ల వెంకటేశ్వర రెడ్డి, డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, చిత్తలూరి సత్యనారాయణ, తగుళ్ళ గోపాల్ లు పురస్కారాలు అందుకున్నారు. ఈ పురస్కారం కోసం 2021 సంవత్సరంలో ముద్రితమైన వచన కవితా సంపుటాలను మాత్రమే మూడేసి ప్రతులను పంపించాల్సిందిగా కోరుతున్నారు. కావున కవులు తమ ప్రతులను డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, ఇ.నం. 8-5-38, టీచర్స్ కాలని, మహబూబ్ నగర్ - 509001, తెలంగాణ రాష్ట్రం అనే చిరునామాకు మే 31 లోపున పంపాలని ఆయన కోరారు. బహుమతి పొందిన ఉత్తమ వచన కవితా సంపుటికి రూ.5,116/- నగదు బహుమతితో పాటు జ్ఞాపికను అందజేస్తారు.

-డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ వ్యవస్థాపకులు
పాలమూరు సాహితి అవార్డ్, మహబూబ్ నగర్
9032844017

టెక్నాలజీ మాల్ ఈ గ్యాలెరియాను ప్రారంభించిన ఎల్‌అండ్ టీ హైదరాబాద్ మెట్రో

హైదరాబాద్, మే 4:హైదరాబాద్ నగర టెక్నాలజీ డీఎన్ఏకు అనుగుణంగా ఎల్ అండ్ టీ మెట్రో రైల్ (హైదరాబాద్) లిమిటెడ్ తమ హైటెక్ సిటీ మాల్ ను ఈ-గ్యాలెరియా గా పునః ప్రారంభించింది. ఈసందర్భంగా ఎల్ అండ్ టీ ఎంఆర్ హెచ్ఎల్ ఎండీ, సీఈఓ కేవీబీ రెడ్డి మాట్లాడుతూ తమ ట్రాన్సిట్ ఆధారిత అభివృద్ధికోసం తమ వృద్ధి ప్రణాళికల్లో భాగంగా ఈ గ్యాలెరియాను ప్రారంభించడం పట్ల చాలా సంతోషంగా ఉన్నామన్నారు. బ్రాండ్లన్నీ కూడా నూతన మార్కెటింగ్ ప్రాంగణాల కోసం ఎదురుతుండటంతో పాటుగా వినూత్నమైన ప్రొడక్ట్ ప్లేస్ మెంట్స్ కోసం చూస్తున్నాయన్నారు. ఈ అవసరాలన్నీ తీర్చే ఒన్ స్టాప్ కేంద్రంగా ఈ-గ్యాలెరియా నిలువనుందన్నారు. ఈ నూతన అవతార్ బ్రాండ్ల మద్దతు, లాయల్టీ వినియోగించుకోవడంలో తమకు సహాయపడటంతో పాటుగా వ్యాపార సంస్థలు, హైదరాబాద్ నగరం కలిసి ఎదగడానికి, స్థిరమైన ఉజ్వల భవిష్యత్ ను అభివృద్ధి చేయడానికి తమకు అవకాశాన్ని అందిస్తుందన్నారు.



వైభవంగా జరిగిన "మణిపూసల రామాయణం" కావ్య ఆవిష్కరణ మహోత్సవం.

తేది 25. 4. 2022 నాడు హైదరాబాద్ లోని తెలంగాణ సారస్వత పరిషత్తులో తెలుగు భాషోపాధ్యాయులు, మణిపూసల ఆశుకవి శ్రీ. టి. ఆశీర్వాదం గారు రచించిన "మణిపూసల రామాయణం" పుస్తకాన్ని హర్యానా రాష్ట్ర గవర్నర్ గౌ. శ్రీ బండారు దత్తాత్రేయ గారు ఘనంగా ఆవిష్కరించారు. మణిపూసల కవితా దినోత్సవం ఏప్రిల్ 26 సందర్భంగా, కె. వి. యల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గవర్నర్ దత్తాత్రేయ గారు మాట్లాడుతూ, శ్రీరాముని లాంటి ఆదర్శ పురుషుడు ఈ భూ ప్రపంచంలోనే లేడని పేర్కొన్నారు. ఈ లాంటి ఉత్తమ పురుషుని చరిత్ర రామాయనాన్ని టి. ఆశీర్వాదం గారు నూతన కవితా ప్రక్రియ అయిన మణిపూసల్లో రాయడం, అది పాడుకోవడనికి అనువుగా ఉండి, ఆబాల గోపాలమును అలరిస్తుంది అనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. ఇలాంటి మరిన్ని రచనలు ఎన్నో రావాలని కోరారు. ఈ సందర్భంగా మణిపూసల రామాయణ రచయిత టి. ఆశీర్వాదం ను, మణిపూసల సృష్టికర్త వడిచర్ల సత్యం ను దత్తాత్రేయ గారు అభినందించి, సన్మానించారు.

మణిపూసల రామాయణం ఆవిష్కరణలో సభకు అధ్యక్షత వహించిన తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు జూలూరి గౌరీశంకర్ గారు మాట్లాడుతూ శ్రమ జీవుల శ్రమ నుండి పుట్టిందే గేయం. టి. ఆశీర్వాదం గారు రచించిన మణిపూసల రామాయణం కూడా పాడుకోవడానికి వీలుగా ఉన్న చక్కని గేయ పుస్తం. ఈ గేయమే ప్రపంచాన్ని నడిపిస్తోంది. దేవుళ్ళను బ్రతికిస్తోంది. ఈ గేయమే నాదమై ప్రకృతిలోని ప్రతి జీవిని పరవశింప జెస్తోంది అన్నారు. ఈ మణిపూసల రామాయణం పుస్తకాన్ని ఆచార్య కసి రెడ్డి వెంకట్ రెడ్డి గారు సమీక్ష చేశారు. ఈ సభలో ప్రముఖ కవులు దోరవేటి , డా. పర్యాద సరళ, దైవజ్ఞ శర్మ, కార్యక్రమ నిర్వహకులు కె. వి. ఎల్ ఫౌండేషన్ అధ్యక్షులు కవుకుంట్ల బందయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మణిపూసల కవితా ప్రక్రియలో వైవిధ్యమైన, విశిష్టమైన రచనలు చేసిన 33మంది కవులకు "ప్రత్యేక మణిపూసల పురస్కారాలు" అందజేశారు.

కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
'బుధవారం బాద్షా'
పోటీ ఫలితాలు

అడ్మిన్: రమాదేవి కులకర్ణి (ప్రథమ)

నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ వలిపే
ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.

ఎన్కటి రాకపోకలు

ఎన్కట సుట్టపోల్లు సుట్టపు సూపు కు ఇంటికొస్తాండ్రని
ఊరోళ్ళతోనో పక్కూరోళ్ళతోనో చెప్పంపెటోళ్ళు.

ఇగ గా వార్త తెలిషిన దగ్గర్నుండి వాళ్ళకోసం
ఎప్పుడొస్తరా అని కండ్లు కాయలుగాషినట్టు ఎదురుజూషెటోళ్ళం.

సక్కగ రోడ్లులేని బాటపొంట బడి ఎండ్లబండ్లల్ల నో
ఎర్రబస్సెక్కో పోగబండెక్కో వాళ్ళు నానాతంటాలుపడి ఇల్లుజేరంగనే ఇగ.

మాఅమ్మోళ్ళు ముసలోల్లు మీదబడి ఒకటే ఏడుపేడ్సేటోళ్ళు
ఎందుకేడుస్తాండ్రో అస్సలు సమజుగాకపోయేది.

గాళ్ళకు కాళ్ళకు నీళ్ళిచ్చి కుర్చీపీటలమీద కూర్సోబెట్టి
కుషలప్రశ్నలన్ని అడిగెటోళ్ళు.

చిన్నోళ్ళం వాల్ల కాళ్ళకు దండాలుపెట్టెటోళ్ళం
వాళ్ళు పావురంగ దగ్గరికి తీస్కొని

ఓ ఐదు పైసలో పది పైసలో ఇస్తరేమో నని ఆశపడేటోళ్ళం
గాకాలంల ఎవ్వరొచ్చిన వట్టిచేతుల్తోటి రాకపోయేటోళ్ళు.

ఏపండో ఫలహారమో తెచ్చేటోళ్ళు వాళ్ళేంతెజ్జిండ్రో అని
అక్కజేల్లెండ్లం నక్కి నక్కి జూషెటోళ్ళం.

వచ్చినోళ్ళకోసం మేం సాదుకునే కోడినే దొరకబట్టి కోషెటోళ్ళు మాఇంట్ల పెద్దోళ్ళు
గప్పుడైతే నాగుండెల మెలిపెట్టినట్టైయ్యేది.

నాకండ్లల్ల నీళ్ళుదిరిగేది ఎందుకంటె గాకోళ్ళను పెంచుడు
అవ్వి గుడ్లేడ పెడ్తానయో అని ఇంటిసుట్టు ఎత్కుడు.

కోళ్ళగూడును సాపుజేసుడు గుడ్లు పొదిగి పిల్లల్ని జేస్తే సంబురపడుడు గియ్యన్ని
నాపనులాయె
గందుకే దుఖమొచ్చేది కోడ్ని దొర్కబట్టి కోస్తాంటె.

కని అమ్మ కమ్మగ వండినంక గింతంత అంటుబోషి
రెండు తున్కలేస్తె సప్పరిచ్చుకుంట తినేటోళ్ళం.

ఇగ సుట్టపోళ్ళు ఎన్నిరోజులుంటె అన్నిరోజులు బడెగ్గొట్టుడే నాయె
ఎన్నో ముచ్చట్లు పెప్పుకునేటోళ్ళు ఓరాత్రిదాక

బయట పక్కలేసుకొని ఎన్నెట్ల సుక్కల్ని లెక్కబెట్టుకుంట
మేమాడుకునేటోళ్ళం వచ్చినోళ్ళ పోరగాండ్లతోని.

ఇగ గావాళ్ళు పోయేరోజు వస్తాందంటెనే
అందరి ముఖాలల్ల రంది బట్టుకునేది.

వాళ్ళకోసం ఏతెల్లారగట్లనో అమ్మోళ్ళు లేషి
సద్దిగట్టుడుకు వంటలు జేషెటోళ్ళు.

వాళ్ళు పోయేటప్పుడు మల్లఅర్ధగంటషేపు ఏడ్షెటోళ్ళు
పంపలేక పంపలేక నడుళ్ళెదాక అందరంబోయేటోళ్ళం.

వాళ్ళుగూడ పోలేక పోలేక దూడనొదిలి గడ్లికిపోయే ఆవులోలె పోయెటోళ్ళు
గా పాషాలు గిప్పుడేడున్నయ్ ఎవలన్న వస్తాండ్రంటెనే
ఎందుకొస్తాండ్రు ఎప్పుడుబోతరని అడుగుడేనాయె.

అసలు సుట్టపోళ్ళు ఇండ్లపొంటి వచ్చిపోయేటందుకు
జర్రంతగూడ కాలంలేని ఎండిన గుండెల బత్కులాయె
కాలమెంత మారిపోయింది మల్ల గాఎన్కటి
రోజులొస్తె ఎంతబాగుండు కద...

-పకుళ వాసు

యాదికొస్తున్న పల్లె

(ద్వితీయ)

అందాల నా పల్లె అపురూప సిరిమల్లె
బంధాల ఆ పల్లె అనుబంధాల మరుమల్లె
చుట్టూర ఉండెటి నిండైన చెరువులు
నడిమధ్య ఊరులో మంచి నీళ్ళ బాయి
మట్టి కుండలో నీళ్ళెంతో హాయి.
కోడి కూతలే అలారములు
ఊట బాయిలే స్విమ్మింగ్ పూలు
డబ్బు అవసరమే రాకుండె మెండుగా
జబ్బు పడితె వంటిల్లె దవఖాన
రోగమేదైనా అమ్మవడిలో కమ్మని వైద్యముండు.
కోతి కొమ్మచ్చి ఆటలు
చిర్రి గోనె గోళీలాటలు
తాడు బొంగరాలు గాలి పటాలు
చెరువు గట్టుపైన చెడుగుడు ఆటలు
దాగుడుమూతల దండాకోర్ ఆటలు
ఆనందానికి అవధులులేని పల్లెలు.
వరుస పిలుపులతో
ఆత్మీయ పలకరింపులు
కుల మతాల పిచ్చిలేని స్వర్గసీమలు
ఒకరికొకరమంటు సహకార సేవలు
నీది నాదనే పొగరులేని ప్రేమ కోవెలలు
దేశ ప్రగతికి పట్టుకొమ్మలు
అందాల నా పల్లె సీమలు

-డా.బి.సుధాకర్



డ్రగ్ స్మగ్లర్లపై కొరడా : రూ . 2 కోట్ల విలువైన హెరాయిన్ సీజ్!

చండీఘఢ్, మే 4:: హరియాణకు చెందిన చిన్న పట్టణం ఫతేబాద్‌లో పెద్దమొత్తంలో డ్రగ్స్ పట్టుబడటం కలకలం రేపుతోంది. గత నాలుగు నెలలుగా ఫతేబాద్ పోలీసులు 2 కిలోలకు పైగా హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

మార్కెట్‌లో ఈ డ్రగ్స్ విలువ రూ 2 కోట్ల వరకూ ఉంటుందని వెల్లడించిన పోలీసులు ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద 84 కేసులు నమోదు చేశారు. 2022లో ఇప్పటివరకూ రూ 2 కోట్ల విలువైన రెండు కిలోలకు పైగా హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నామని ఫతేబాద్ డీఎస్పీ సుభాష్ చంద్ర పేర్కొన్నారు.

ఆయా కేసుల్లో పలువురు డ్రగ్ స్మగ్లర్లను అరెస్ట్ చేశామని చెప్పారు. డ్రగ్ స్మగ్లర్లపై యాంటీ నార్కోటిక్స్ బృందం ఉక్కుపాదం మోపుతోందని అన్నారు. ఇక మంగళవారం రాత్రి ఫతేబాద్ పోలీసులు 302 గ్రాముల హెరాయిన్‌ను సీజ్ చేసి ముగ